ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 20 ఏప్రిల్ 2025 | 5



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0 (శనివారం)
కనిష్ఠం : 26.0

డీఎస్సీ షెడ్యూల్ విడుదల


- ఉమ్మడి జిల్లాలో 1241 పోస్టులు
- నోటిఫికేషన్‌కు అనుమతి జారీ

కాకినాడ రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ నోటిఫికేషన్‌కు ఎదురు చూస్తున్న కొన్ని లక్షల మంది అభ్యర్థుల కల నెలవేరింది. డీఎస్సీ నోటిఫికేషన్‌కు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.ఆదివారం ఉదయం నోటిఫికేషన్ విడుదలవుతుంది.రాష్ట్రవ్యాప్తంగా 16,347 వరకు ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేయనున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన 45 రోజుల తరువాత పరీక్షలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఖాళీలివే....

మొత్తం 1,241 ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీచేయనున్నారు.స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి తెలుగు 65, హిందీ 78, ఆంగ్లం 95, గణితం 64, ఫిజికల్ సైన్స్ 71, బయాలాజికల్ సైన్స్ 103,సోషల్ స్టడీస్ 132, వ్యాయామ విద్య 210, ఎస్జీటీలు 423 డీఎస్సీ ద్వారా భర్తీకానున్నాయి.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ్ సంబంధించి ఫిజికల్ సైన్స్ 3,బయోలాజికల్ సైన్స్ 4, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామవిద్య 1, ఎస్జీటీలు 104 మొత్తం 112 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీచేయనున్నారు.ప్రత్యేక విద్యకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 13 టీజీటీలు, 3 పీఈటీలు, 15 ఎస్జీటీలతో కలిపి మొత్తం 31 పోస్టులు భర్తీకానున్నాయి.జోన్ 2(ఉమ్మడి ఈస్ట్, వెస్ట్, కృష్ణా)కి సంబంధించి ఏపీఆర్ఎస్, ఏపీఎంఎస్, ఏపీఎస్ డబ్ల్యు, బీసీ, సోషల్ వెల్ఫేర్‌కు సంబంధించి పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 3, పీఈటీ 24లతో కలిసి 348 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తారు.


హ్యాపీ బర్త్‌డే చంద్రబాబు



చంద్రబాబు.. ఉభయ తెలుగు రాష్ట్రాలో ఈ పేరు తెలియనివారుండరు.. ఎందుకంటే రాజకీయాల్లో మాస్టారు.. అపరచాణక్యుడిగా పేరు.. ఏపీ అభివృద్ధికి కంకణం కట్టుకున్న మెగాస్టారు.. రాజధాని అమరావతికి ఆద్యుడు.. ప్రజల మనసెరిగిన మహా నాయకుడు.. ఆయనే సీఎం చంద్రబాబు నాయుడు.. ప్రస్తుత ఏపీ రాజకీయాల్లో ఆయనకంటే సీనియర్ ఎవరూ లేరు.. ప్రజలకు ఏదో చేయాలనే తపన.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పం.. ప్రజలకు అండగా నిలబడే తత్వం.. అదే గత సార్వత్రిక ఎన్నికల్లో విజయం వైపు దూసుకెళ్లేలా చేసింది.. బాబు వస్తే.. అభివృద్ధి చేస్తారు.. పేదలకు అండగా నిలబడతారని ప్రజలు నమ్మారు.. ఓటేశారు..ఏకంగా 164 స్థానాలు ఇచ్చారు..తమ నాయకుడిని గెలిపించుకున్నారు.. నేడు 75వ పుట్టినరోజు సందర్భంగా.. హ్యాపీ బర్త్‌డే బాబు అంటున్నారు..

ఆదివారం ప్రత్యేకం

సి..నిమా హిట్టే!





హీరో బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి సినిమా చూశారా.. అందులో విలన్ కొడుకు షిప్‌లో కస్టమ్స్‌కు దొరికిపోతాడు. అప్పుడు విలన్ ఆ షిప్‌ను సముద్రంలోనే పేల్చేస్తాడు.. ఆ సీన్లలో కొన్ని కాకినాడ సీపోర్టులోనే తీశారు.





పుష్ప-2 సినిమాలో ఎర్రచందనం దుంగలను విదేశాలకు షిప్‌లో తరలించే సీన్ చూశారా.. అందులో హీరో అల్లు అర్జున్ పోర్టులో నిలబడి సవాల్ చేస్తాడు.. ఆ తర్వాత ఎర్రచందనం పట్టుకోవడానికి విలన్ ఫాజిల్ సైతం పోర్టులో అడుగుపెడతాడు.. ఆ కీలక సన్నివేశాలు ఎక్కడో తెలుసా.. ఇదిగో మన కాకినాడ సీపోర్టులోనే..

కాకినాడ పోర్టులో పుష్ప-2 సినిమాలో అల్లు అర్జున్‌పై తీసిన సీన్





దుల్కర్‌సల్మాన్ హీరోగా నటించిన లక్కీభాస్కర్ సినిమాలో హీరో తీవ్ర ఆర్థిక సమస్యల్లో ఉంటాడు. ఈ సమయంలో క్యారెక్టర్ ఆర్టిస్ట్ రాంకీ హీరో వద్దకు వెళ్లి రూ.2 లక్షలు ఇస్తే పోర్టులో దిగుమతై ఉండిపోయిన టీవీల స్టాకును రప్పిస్తానని చెబుతాడు. అప్పుడు రాంకీ హీరో వద్ద డబ్బులు తీసుకుని పోర్టులో కస్టమ్స్‌కు డబ్బులు ఇచ్చి టీవీల స్టాకును విడిపిస్తాడు. దాంతో హీరోకు భారీగా లాభం వస్తుంది. ఈ ముఖ్యమైన సీన్లన్నీ ఎక్కడో కాదు.. కాకినాడ సీ పోర్టులోనే షూటింగ్ చేశారు.

బ్లాక్‌బస్టర్ మూవీ అలవైకుంఠపురంలో హీరో అల్లు అర్జున్ విలన్ సముద్రఖనితో గొడవ పడే సీన్లు చూశారా.. అక్కడ విలన్ కొడుకుతో సాగించే ఆసక్తికరమైన స్టైలిష్ ఫైట్లు అందరినీ అలరిస్తాయి. ఇది కాకినాడ సీపోర్టులోనే షూటింగ్ చేశారు..

సినిమాల విజయతీరం కాకినాడ!

22 సినిమాల షూటింగ్

అనేక బ్లాక్‌బస్టర్ తెలుగు సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా కాకినాడ సీపోర్టు మారింది.. చాలా సినిమాల్లో అత్యంత కీలక సన్నివేశాలు, క్లైమాక్స్ ఫైట్లు, షిప్‌ల్లో కార్గో ఎగుమతికి సంబంధించిన సీన్లు సీపోర్టులోనే చేస్తున్నారు. పోర్టులో షూటింగ్ చేయడానికి హీరోలు, డైరెక్టర్లు, నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే సినిమాలో ఏదొక చిన్న పార్ట్ అయినా పోర్ట్‌లో షూట్ చేస్తే బొమ్మ హిట్ అనే సెంటిమెంట్ బలపడిపోయింది. అందుకే అనేక సినిమాలు పోర్టులో షూటింగ్ చేసుకుని హిట్ కొడుతున్నాయి. - (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

తెలుగు సినిమా మారింది.. బడ్జెట్ పెరిగింది.. చిత్రీకరణలోనూ తేడా వచ్చింది.. ఎక్కడో విదేశాలకు కాకుండా లోకల్ స్పాట్లకు డిమాండ్ పెరిగింది. గతంలో సినిమా తీశారంటే విదేశాలకు వెళ్లాల్సిందే. ప్రస్తుతం గోదావరి జిల్లాల వెంట పరుగెడుతున్నారు. సముద్రం.. పోర్టు.. కావాలంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ పోర్టులో సినిమా హీరోలు.. డైరెక్టర్లు వాలిపోతున్నారు. వంద కోట్ల బడ్జెట్ నుంచి రూ.10 కోట్ల బడ్జెట్ సినిమాల వరకు కాకినాడ సీపోర్టులో షూటింగ్ చేసుకోవడానికి పోటీపడుతుంటారు. తరచూ సినిమా షూటింగ్ లతో సందడి మారి సినిమా పోర్టుగా పేరు తెచ్చుకుంది. పోర్టులో అనేక ప్రాంతాలు కీలక సన్నివేశాల చిత్రీకరణకు అనువుగా ఉండడంతో చాలామంది డైరెక్టర్లు సినిమా షూటింగ్‌లకు ఎంచుకుంటున్నారు. సీపోర్టుకు తరచూ వివిధ దేశాల నుంచి భారీ నౌకలు ఏకంగా బెర్త్ వద్దకే వస్తాయి. కార్గో లోడింగ్‌కు వారం నుంచి పది రోజుల వరకు ఇక్కడే ఉంటాయి. కస్టమ్స్ అధికారులు, భారీ క్రేన్లు, టిప్పర్లు, విశాలమైన బెర్త్‌లు, వెనుక సముద్రం.. ఇవన్నీ సినిమా షూటింగ్‌కు అనువుగా, అందంగా ఉంటున్నాయి. దీంతో అనేక చిత్రాలు ఇక్కడకు క్యూ కడుతున్నాయి.

షూటింగ్‌కు రోజుకు రూ.లక్ష

పోర్టు..షిప్‌లు.. సముద్రం బ్యాక్‌డ్రాప్‌లో సినిమా షూటింగ్ చేయాలంటే చాలా కష్టం. పోర్టుల్లో అనుమతులివ్వరు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పోర్టులో షూటింగ్ చేయాలంటే వైజాగ్ పోర్టు కేంద్రం ఆధీనంలో ఉంటుంది. అనుమతులు కష్టం. పక్కనే గంగవరం పోర్టు ఉన్నా నేవీ స్థావరాల నేపథ్యంలో అనుమతులు రావు. ఆ తర్వాత కాకినాడ పోర్టు ఉంది. అయితే ఇక్కడ అనుమతులను పోర్టు యాజమాన్యం సులువుగా ఇస్తోంది.సినిమా షూటింగ్‌లకు విశాలంగా ఉండడంతో ఎక్కువ మంది డైరెక్టర్లు ఇటే మొగ్గు చూపుతున్నారు. వాస్తవానికి ఎయిర్‌పోర్టు లేదా మెట్రో స్టేషన్లు, రైళ్లలో షూటింగ్ చేయా లంటే రోజుకు రూ.16 లక్షల వరకు ఛార్జ్ చేస్తారు. కాకినాడ సీపోర్టులో రోజుకు షూటింగ్‌కు రూ.లక్ష వసూలు చేస్తారు. తక్కువ ఛార్జీలు ఉండడం కూడా పోర్టులో సినిమా షూటింగ్‌లకు కలిసివస్తోంది. వాస్తవానికి పోర్టు కట్టిన స మయంలో సినిమా షూటింగ్‌లకు ఛార్జి రోజు కు రూ.10 వేలు.అప్పుడే ఆర్.నారాయణ మూర్తి హీరోగా ఎర్రసముద్రం సినిమా షూటింగ్ చేశారు. సినిమా షూటింగ్‌లకు సరిపడా వాతావరణం పోర్టులో ఉండడంతో ఇక్కడకు క్యూ కడుతున్నారు. ఇక్కడ చిత్రీకరణ చేసుకున్న సినిమాల్లో 80 శాతం వరకు హిట్ అవుతున్నాయి. సినిమాకు సంబంధించి హీరో పోర్టులో షూటింగ్‌లో పాల్గొనే సన్నివేశాలుంటే ఆ సినిమా హిట్ పక్కా అని పోర్టు అధికారులు చెబుతుండడం విశేషం.

అల్లు అర్జున్‌కు ఎంత సెంటిమెంటో..

పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్‌కు కాకినాడ సీపోర్టు సెంటిమెంట్‌గా మారింది. ఆయన సినిమా ఏదైనా సీపోర్టులో షూటింగ్ జరగాల్సిందే. తొలుత అలవైకుంఠపురం సినిమాలో కీలక ఘట్టాలన్నీ ఇక్కడే చిత్రీకరించారు. ఆ తర్వాత 'పుష్ప' సినిమా షూట్ చేశారు. ఈ సినిమా సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. పుష్ప-2 కూడా ఇక్కడే వారాల తరబడి షూటింగ్ చేశారు.



కాకినాడ సీపోర్టులో ఇప్పటివరకు 22 సినిమాల షూటింగ్‌లు జరిగాయి. 2000లో విజయకాంత్ హీరోగా మాస్, 2008లో ఆర్.నారాయణమూర్తి హీరోగా ఎర్రసముద్రం, 2018లో హీరో రామ్ నటించిన హలోగురు ప్రేమ కోసమే.. విజయ దేవరకొండ హీరోగా గీత గోవిందం.. అడవి శేషు హీరోగా గూఢచారి, 2019లో శర్వానంద్ హీరోగా రణరంగం, 2019లో విజయ్ దేవరకొండ నటించిన డియర్ కామ్రేడ్, అల్లు అర్జున్ హీరోగా అల వైకుంఠపురం, 2021లో అల్లు అర్జున్ హీరోగా పుష్ప 2, హీరో శ్రీరాం నటించిన దాడి, చిరంజీవి, రాంచరణ్ నటించిన ఆచార్య, రవితేజ హీరోగా ఖిలాడీ, 2022లో నవీన్‌చంద్ర నటించిన రుద్ర, 2023లో బాలకృష్ణ భగవంత్ కేసరి, వెంకటేష్ నటించిన సైంధవ్, హీరో గోపిచంద్ నటించిన భీమ, రవితేజ హీరోగా టైగర్ నాగేశ్వరరావు, పవన్ కల్యాణ్ హీరోగా ఓజీ, 2024లో దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్, అల్లు అర్జున్ పుష్ప-2, హీరో సిద్దు డీజే టిల్లు స్కేర్, ఉపేంద్ర హీరోగా రోసీ-45 తదితర చిత్రాలు ఇక్కడే షూటింగ్‌లు చేసుకున్నాయి. పోర్టులో షూటింగ్ చేస్తే ఆ సినిమా హిట్ అనే ప్రచారం బలంగా ఉంది.



ఓటర్ల సంఖ్యను హేతుబద్ధీకరిస్తాం

డీఆర్వో సీతారామమూర్తి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య హేతుబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నామని డీఆర్వో టి.సీతా రామమూర్తి తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీలు తమ వంతుగా సహకారం అందించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 1581 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 1168 కేంద్రాల్లో 1200 మంది కంటే తక్కువ ఓటర్లు ఉండగా 413 కేంద్రాల్లో 1200కి పైబడి ఉన్నారన్నారు. హేతుబద్ధీకరణ ప్రక్రియ ద్వారా సమం చేస్తామన్నారు. జిల్లాలో పురుషులు 7,91,179, మహిళలు 8,29,229 కలిపి మొత్తం 16,21,164 మంది ఓటర్లు ఉన్నారన్నారు . సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు టీడీపీ ఎం.శివ సత్య ప్రసాద్,ఆప్ కె.సంతోష్ కుమార్,వైసీపీ టి.దేవదానం, సీపీఐ ఎంపీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు ఫ్లయ్ ఓవర్ వేగవంతం చేయాలి

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో శనివారం ఇరిగేషన్, రెవెన్యూ ,వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ప్రాజెక్టు వల్ల జిల్లాకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. సాంకేతిక పరమైన అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆర్‌డీవో, రైల్వే ఈఈ, ఎస్ఈ ఇరిగేషన్, జిల్లా వ్యవసాయాధికారులు పరస్పరం సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.ఎర్రకాలువ వరదలు వచ్చినప్పుడు ముంపు ఇబ్బందులు లేకుండా పరిష్కారం కోసం జిల్లా మంత్రితో చర్చించి నివేదిక ఇస్తామని చెప్పారు.సమావేశంలో ఆర్‌డీవో రాణి సుస్మిత, ఎస్ఈ కే.గోపినాథ్, ఈఈ ఎం.సుబ్రహ్మణ్యం, డీఏవో ఎస్.మాధవరావు, ఎర్రకాలువ డీఈ కే.రమేష్ పాల్గొన్నారు.



7
కార్మికులకు దన్ను ఈ శ్రమ్ కార్డులు

ఈ-పోస్ యంత్రాలతో మార్కెట్ చెస్ వసూళ్లు

వచ్చే వారం నుంచి జిల్లాలో అమలు

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్కెట్ కమిటీల చెక్ పోస్టుల వద్ద ఈ పోస్ పరికరం ద్వారా డిజిటల్ విధానంలో రైతుల నుంచి చెస్ వసూళ్లు చేస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం ఎస్‌బీఐ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లతో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 చెక్‌పోస్టులలో ఈ పరికరాలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఇక ఎక్కడా చెస్‌ను నగదు రూపంలో వసూలు చేయకూడదని తెలిపారు. ఇది పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో అమలు చేస్తున్నామన్నారు. తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వస్తుందన్నారు.ఆర్థికపరమైన లావాదేవీల్లో అక్రమాలకు తావులేకుండా ఈ ప్రతిపాదన చేసినట్టు తెలిపారు. డిజిటల్ నగదు చెల్లింపు వల్ల ప్రభుత్వ ఖాతాలకు నేరుగా జమవుతుందని దీని వల్లన అక్రమాలకు తావుండదన్నారు. సరుకు దానికనుగుణంగా చెస్ విధిస్తారన్నారు.జిల్లాలో అనపర్తి ఏఎంసీ పరిధిలో బిక్కవోలు చెక్‌పోస్టు, రాజమండ్రి పరిధిలో కాతేరు ,కొవ్వూరు పరిధిలో కొవ్వూరు,సీతంపేట, గోపాలపురం పరిధిలో యర్నగూడెం ,గోపాలపురం, నల్లజర్ల, నిడదవోలు పరిధిలో పెరవలి , నిడదవోలు, రాజానగరం పరిధిలో రాజానగరం,సీతానగరం, కోరుకొండ చెక్‌పోస్టుల్లో పరికరాలు సిద్ధం చేయాలన్నారు. వచ్చేవారం నుంచి డిజిటల్ సేవలు అమల్లోకి వస్తాయన్నారు.సమావేశంలో మార్కెట్ కమిటీ ఏడీ ఎం.సునీల్‌వినయ్,ఎల్‌డీఎం పీవీ.ప్రసాద్, ఎస్‌బీఐ జోనల్ సేల్స్‌మేనేజర్‌రాజేష్ పాల్గొన్నారు.

ఈ వేస్ట్ ఇంట్లో ఉంటే..కేన్సర్ ముప్పు

మంత్రి కందుల దుర్గేష్



సుబ్రహ్మణ్య మైదానంలో ఈ వ్యర్థాలను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్. చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఈ వేస్ట్‌పై అవగాహన లేక ప్రజలు వాటిని ఇంట్లో నిల్వచేస్తున్నారని.. దీని వల్ల అనారోగ్యం పాలవుతారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్యం మైదానం, బొమ్మూరు వైటీసీ ప్రాంగణంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాలకు హాజరై మాట్లాడారు. ఈ వేస్ట్ అంటే ఎలక్ట్రికల్ వ్యర్థాలని.. టీవీ, కంప్యూటర్, మొబైల్ ఫోన్లు, వైర్లు, ఎలక్ట్రికల్ పరికరాలు పాడైపోయిన తరు వాత నిల్వ చేయకూడదని చెప్పారు.వాటిని రీసైక్లింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన కేంద్రంలో అప్పగించాలన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల నుంచి వెదజల్లే రేడియేషన్ వల్ల కేన్సర్, ఇతర అనారోగ్యాలకు గురి కావడం చూస్తున్నామన్నారు.కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ప్రతివారం మూడో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు.ఈ వారం ఈ వేస్ట్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ వేస్ట్‌లో ఉత్పన్నమయ్యే రసాయనాల వల్ల క్యాన్సర్ వస్తుందని.. అటువంటివి ఇంట్లో ఉంటే వెంటనే వాటిని సేకరణ కేంద్రాలకు అప్పగించాలన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సరైన విధానంలో డిస్పోజ్ చేయాలన్నారు. రాజమహేంద్రవరం, రూరల్, రాజానగరం ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఈ వేస్ట్ విషయంలో మహిళలు అవగాహన కలిగి ఉం డాలన్నారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ ఈవేస్ట్‌ను సేకరించే కేం ద్రాలు రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేస్తున్నామని..ప్రజల నుంచి పరికరాల వారీగా కొనుగోలు చేసి వాటిని శ్రీకాకుళం వద్ద ఉన్న రీసైక్లింగ్ ప్లాంట్‌కు తరలిస్తామన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించి సేకరించిన ఎలక్ట్రికల్ వేస్ట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, ఇన్‌చార్జి డీపీవో శాంతామణి, డ్వామా పీడీ ఏ నాగమహేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, డీఎల్‌డీవో వీణాదేవి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మజ్జి రాం బాబు, నగరపాలక సంస్థ సెక్రటరీ శైలజవల్లి, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, మండల ప్రత్యేకాధికారి ఎన్ .జ్యోతి,రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావు , ఈఈ మదర్షా ఆలీ,శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్, ఆర్వో సీహెచ్.శ్రీనివాసరావు, మేనేజరు మాలిక్ పాల్గొన్నారు.





మంచినీటికి పడిగాపులు

అందని సత్యసాయి తాగునీరు

- 15 మండలాల్లో కట కట
- వారం రోజులుగా ప్రజల ఇక్కట్లు

కోరుకొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు.. వారం వారం సమస్య వస్తూనే ఉంది. అయినా పట్టించుకునేవారే కానరావడంలేదు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబు సుమారు రూ.500 కోట్లు ఖర్చు పెట్టి 15 మండలాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి బృహత్తర పథకం చేపట్టారు. కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాలతో సహా ఏజెన్సీ ప్రాంతంలో కొన్ని మండలాలకు, గోదావరి జలాలను శుద్ధి చేసి పైపులైన్ల ద్వారా మంచినీరందే ఏర్పాట్లు చేశారు.ఈ మేరకు గ్రామాల్లో ప్రత్యేకంగా ట్యాంకులు నిర్మించారు. అయితే గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు సక్రమంగా మంచినీరందడం లేదు. నెలలో నాలుగైదు రోజులు మాత్రమే మంచినీరందించి చేతులు దులుపుకుంటున్నారు.ఈ ఏడాది సమస్య మరింత జటిలమైంది. కోరుకొండ మండలంలో 22 గ్రామాలు సత్యసాయి మంచినీటిపై ఆధారపడి ఉన్నాయి. ఈ ఏడాది సంక్రాంతి పండుగ, లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో కూడా ప్రజలకు మంచినీరందలేదు.ప్రతి నెలలోను ఇదే పరిస్థితి పునరావృతమవుతుంది. సత్యసాయి మంచినీటి సరఫరాలో పని చేసే కాంట్రాక్ట్ సిబ్బందికి ప్రభుత్వం సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని, అందుకే తరుచుగా సిబ్బంది మంచినీటిని సక్రమంగా అందించకుండా ప్రజలను ఇబ్బంది చేస్తున్నట్టు చెబుతున్నారు. సుమారు 21నెలల జీతం చెల్లించాలని వారంటున్నారు. ఇటీవల సిబ్బంది సమ్మెకు దిగిన సందర్భంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్ళారు. దాంతో సిబ్బంది తాత్కాలికంగా రెండు నెలల వేతనం అందించే ఏర్పాటు చేశారు. అప్పట్లో 10 రోజులు మంచినీరందించారు. మళ్లీ షరా మామూలే. గత వారం రోజులుగా సత్యసాయి మంచినీటి ట్యాంకుల ద్వారా ప్రజలకు గోదావరి మంచినీరు అందడం లేదు. అసలే వేసవి కాలం కావడంతో తాగునీటి వినియోగం బాగా పెరిగింది. పరిశుభ్రమైన మంచినీరందించకపోతే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



లీప్ ...రిలీఫ్

- ఇకపై అన్నీ ఒకే యాప్ ద్వారా నమోదు
- అమల్లోకి తెచ్చిన విద్యా శాఖ
- హామీ నిలబెట్టుకున్న ప్రభుత్వం
- ఉపాధ్యాయులపై తగ్గిన భారం

> యాప్‌ల భారంతో సతమతమవుతున్న ఉపాధ్యాయులకు ఊరటనిస్తూ కూటమి ప్రభుత్వం లెర్నింగ్ ఎక్సలెన్సీ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) పేరిట నూతన యాప్‌ను ప్రవేశపెట్టింది. దీని ద్వారా ఉపాధ్యాయుల హాజరు నమోదు చేయాలని ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా విద్యా శాఖ అధికారుల ఆదేశాలతో ఉపాధ్యాయులు నూతన యాప్ ద్వారా తమ హాజరును నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించారు.

తొండంగి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో... ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం, నాడు-నేడు పనులు, విద్యార్థులకు కిట్ల పంపిణీ... ఇలా ఒక్కో దానికీ ఒక్కో యాప్ ఉండేది. వాటి పాస్‌వర్డ్‌లను గుర్తించుకుని లాగిన్ అవ్వడం టీచర్లకు తలకు మించిన భారంగా ఉండేది. అంతేగాక ఉపాధ్యాయుల వివరాలను సీఎస్‌సీ ద్వారా నమోదు చేయాల్సి వచ్చేది. విద్యా సంవత్సరంలో సుమారు 30కి పైగా యాప్‌లను వినియోగించాల్సి వచ్చేది. యాప్‌ల భారం తగ్గించండి మహాప్రభో అంటూ ఉపాధ్యాయులు మొత్తుకున్నా అప్పటి ప్రభుత్వం చెవికెక్కలేదు. యాప్‌ల భారం తగ్గిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్ కూడా ఒకే యాప్ ద్వారా పాఠశాలకు చెందిన అన్ని విషయాలను నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు 'లీప్' యాప్‌ను రూపొందించారు.

లీప్ యాప్‌లో అంశాలివే...

గతంలో ఉన్న సిమ్స్ యాప్ పాస్‌వర్డ్, యూజర్ నేమ్ ఉపయోగించి లీప్ యాప్‌తో లాగిన్ అవ్వొచ్చు. లాగిన్ అయ్యాక స్టూడెంట్, డిపార్ట్‌మెంట్ అనే రెండు టైయిల్స్ కనిపిస్తాయి. దీనిలో డిపార్ట్‌మెంట్‌పై క్లిక్ చేస్తే ఆరు అంశాలు కనిపిస్తాయి. స్కూల్, టీచర్, కమ్యూనికేషన్, స్టూడెంట్, గవర్నెన్స్, డేష్ బోర్డు డిస్‌ప్లే అవుతాయి.

వీటిలో టీచర్‌పై క్లిక్ చేస్తే టీచర్ ప్రొఫైల్ ఓవర్ వ్యూ, టీచర్ లీడర్‌షిప్ అండ్ ట్రైనింగ్, టచర్ సర్వీసెస్, టీచర్ రిసోర్సెస్ అనే అంశాలు కనిపిస్తాయి. టీచర్ సర్వీసెస్‌లో అటెండెన్స్ అనే టైయిల్ ద్వారా హాజరువేయవచ్చు. ఇదే టైయిల్‌లో లీవ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను పొందుపరిచారు.

గవర్నెన్స్ విభాగంలో సీఎస్‌సీ, సమగ్ర శిక్షా, మిడ్‌డేమీల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే నాలుగు ప్రధాన అంశాలను పొందుపరిచారు. గతంలో ఉన్న ఐఎంఎంఎస్ యాప్ మిడ్‌డే మీల్ విభాగంలో ఓపెన్ అయ్యి మధ్యాహ్న భోజన పథకం ఫొటోలు అప్‌లోడ్ చేసే వీలు కల్పించారు. దీంట్లోనే బాత్‌రూమ్‌ల తనిఖీని నమోదు చేసే టీఎంఎఫ్‌ను కూడా జత చేశారు. సమగ్ర శిక్షా విభాగంలో పాఠశాల కమిటీ, తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర, కోకరిక్యులర్ యాక్టివిటీస్‌లను పొందుపరిచారు.

సీఎస్‌సీ విభాగంలో హెచ్‌ఎం అప్రూవల్, టీచర్ ఇన్‌ఫర్మేషన్ అంశాలు ఉన్నాయి. దీనిద్వారా నేరుగా ఉపాధ్యాయులు తమ సమాచారాన్ని సీఎస్‌సీ సైట్‌లోకి వెళ్ల కుండానే నమోదు చేసే వీలుంది.



స్టూడెంట్ విభాగంలో స్టూడెంట్ ప్రొఫైల్ ఓవర్ వ్యూ, పెర్ఫార్మెన్స్ ఎన్‌టైటిల్‌మెంట్, యాక్షన్స్ అనే విభాగాల ద్వారా విద్యార్థులకు సంబంధించిన అంశాలను నమోదు చేసే వీలుకల్పించారు.

డ్యాష్ బోర్డు విభాగంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ఎండీఎం తీసుకున్న వారి సంఖ్య, అసెస్‌మెంట్, అపార్ స్థితి, ఆధార్ నమోదు, విద్యార్థుల బదిలీలు, విద్యా కమిటీ, తల్లిదండ్రుల కమిటీల సమావేశాల సంఖ్య, శాతం తదితర అంశాలను పొందుపరిచారు.

విద్యార్థి విభాగంలో విద్యార్థి అపార్ నెంబర్‌తో లాగిన్ అయ్యి ఆ విద్యార్థికి సంబంధించిన అన్ని అంశాలను దాని ద్వారా తెలుసుకునే విధంగా లీప్ యాప్‌ను రూపొందించారు. మరికొన్ని విభాగాలకు సంబంధించిన సమాచారం త్వరలోనే అందుబాటులోకి రానున్నట్టు డిస్‌ప్లే అవుతోంది. ఉపాధ్యాయుల ప్లే స్లిప్, మెడికల్ బిల్లుల స్థితి తదితర అంశాలు దీనిలో ఉన్నాయి.

మొత్తానికి అనేక యాప్‌ల గోల లేకుండా ఒకే యాప్ ద్వారా పాఠశాలకు చెందిన అన్ని అంశాలు నమోదు చేసే అవకాశం కల్పించడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి, విద్యా శాఖ మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు చెప్తున్నారు.



సత్యసాయి శ్రీనివాస్



డేవిడ్ జాన్సన్

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'శ్రీప్రకాష్' విద్యార్థుల ప్రతిభ

తుని రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 23 మంది అర్హత పొందారని, కె.సత్యసాయి శ్రీనివాస్ భగవాన్ 77వ ర్యాంకు, డేవిడ్‌జాన్సన్ దేవి 2948 ర్యాంకు సాధించారని చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, ప్రిన్సిపాల్ వీవీఎస్ఎస్ భానుమూర్తి, అకడమిక్ ఇన్‌చార్జి డీఈ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.







ఎండలు మండిపోతున్నాయి... మనుషులే కాదు పక్షులు కూడా వేసవి తాపాన్ని తట్టుకోలేకపోతున్నాయి... అందుకే ఈ పిచ్చుకలు ఎండ నుంచి రక్షణకు తాటి చెట్ల చెంత గూడు ఏర్పరచుకుంటున్నాయి.... కాకినాడ జిల్లా గొల్లప్రోలు జాతీయ రహదారి పక్కన ఓ తాటిచెట్టుకు కనిపించిన పిచ్చుక గూళ్లను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ





స్కేటింగ్‌లో దూసుకెళుతూ..



కరాటేలో శిక్షణ పొందుతూ...

ఆడుతూ.. పాడుతూ...

వేసవి శిక్షణ తరగతులకు వేళాయె

కాకినాడలో వివిధ అంశాల్లో పిల్లలకు శిక్షణ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వేసవి సెలవులు వస్తున్నాయ్.. ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. మరికొన్ని రోజుల్లో పదో తరగతి ఫలితాలు కూడా వెలువడనున్నాయి. ఒకటి నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులకు ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నాయి. ఈనెల 23లోపు దాదాపు అన్ని తరగతులకు పరీక్షలు పూర్తి కానున్నాయి. అయితే రానున్న వేసవి సెలవులను ఎలా వినియోగించుకోవాలి అనే ఆలోచనలో విద్యార్థులు ఉన్నారు. కొందరు ఆటపాటలతో సరదాగా సెలవులను ఎంజాయ్ చేస్తే.. మరికొందరు మాత్రం తమ అభిరుచి మేరకు ఇష్టమైన రంగంలో శిక్షణ పొందేందుకు సిద్ధమవుతున్నారు. వారి ఆసక్తికి తగ్గట్టుగానే కాకినాడ నగరంలో పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో...

పిల్లలకు ఆసక్తి ఉన్న క్రీడాంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు శిబిరాల నిర్వహణకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మే ఒకటో తేదీ నుంచి నెల పాటు వివిధ క్రీడాంశాల్లో చిన్నారులకు తర్ఫీదు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. డీఎస్ఏ మైదానంతో పాటు కొన్ని ప్రభుత్వ పాఠశాలలు, మైదానాలు, ఇతరచోట్ల శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాకినాడ జిల్లావ్యాప్తంగా 50 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరాలకు రూ.3.50 లక్షలు కేటాయిస్తున్నట్టు అధికారులు చెప్తున్నారు. క్రీడా సామగ్రికి రూ.ఐదు వేలు, శిక్షకుడికి రూ.1,500, ఇతరత్రా వాటికి రూ.500 ఖర్చు చేయనున్నారు. ఇక్కడ క్రికెట్, టైక్వాండో, అథ్లెటిక్స్, ఆర్చరీ, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, జూడో, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, యోగా, టేబుల్ టెన్నిస్, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్, హాకీ... ఇలా 23 క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. వేసవి శిబిరాలకు సంబంధించి రెండు, మూడు రోజుల్లో 'శాప్' నుంచి ఉత్తర్వులు రాగానే కలెక్టర్ షాన్ మోహన్ అనుమతితో దరఖాస్తులు స్వీకరిస్తామని డీఎస్‌డీవో బి.శ్రీనివాస కుమార్ తెలిపారు.



బాల భవన్‌లో సంగీత సాధన చేస్తూ...

బాల భవన్‌లో...

కాకినాడ గాంధీనగర్‌లోని బాల భవన్‌లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు కరాటే, సంగీతం, వయొలిన్, గాత్రం, మృదంగం, చిత్రలేఖనం అంశాల్లో శిక్షణ ఇస్తారు. 6-16 ఏళ్ల మధ్య వయసు పిల్లలు వారికి నచ్చిన అంశాల్లో శిక్షణ పొందవచ్చు. వేసవిలోనే కాదు.. సాధారణ రోజుల్లోనూ ఇక్కడ పలు అంశాల్లో తర్ఫీదు ఇస్తున్నట్టు బాలభవన్ పర్యవేక్షకురాలు ఎ.శారద తెలిపారు.

నగరంలో పలుచోట్ల వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. రాజా ట్యాంక్ ఆవరణలోని స్కేటింగ్ రింక్‌లో ఇప్పటికే వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. చిన్నారులకు స్కేటింగ్‌లో సుమారు నెల పాటు మూడు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నారు. ఇటీవలి కాలంలో చాలా మందికి ఆంగ్లంలో మాట్లాడటంపై ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో కచేరీపేటలోని సుందరయ్య భవన్‌లో ప్రతిరోజూ సాయంత్రం 6-7 గంటల మధ్య స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత శిక్షణ ఇస్తున్నారు.





బాల భవన్‌లో వయొలిన్, మృదంగం శిక్షణ పొందుతున్న విద్యార్థులు



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి కృష్ణదీపక్‌రెడ్డి

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'ఆదిత్య' ప్రభంజనం

కాకినాడ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో జాతీయ స్థాయి ఉత్తమ ర్యాంకులతో 'ఆదిత్య' ప్రభంజనం సృష్టించింది. అఖిల భారత స్థాయిలో కె.రుత్విక్ (23), పి.ఆదిత్య అభిషేక్ (46), వైపీ వీరసూర్య చక్రపవన్ (109), ఎం.జయచంద్ర (111), కె.సాయిశ్రీహిత్ (112), కె.వర్షికసాయి (118), పీడీ నాగలక్ష్మి (135), వై.లక్ష్మీకీర్తన (144), సీహెచ్ సాయిర్షిత్ (155), బి.పూజిత (206), కె.ప్రకాష్ రాజ్ (212), జి.శ్రీరామశశాంక్ (280), పి.కృష్ణ భార్గవ్ (300), ఎస్.శ్రీలేఖ (309), టి.యశ్వంత్ (342), వైఎస్ శ్రీవల్లీఆత్రేయి (359), ఆర్.భరత్ నారాయణ్ (395) ర్యాంకులను వివిధ కేటగిరీల్లో సాధించినట్టు ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి ఎస్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. అఖిల భారత స్థాయిలో అన్ని కేటగిరీల నుంచి 100లోపు 2, 500లోపు 17, 1000లోపు 27, 2000లోపు 44, 5000లోపు 102 మంది విద్యార్థులు ర్యాంకులు కైవసం చేసుకున్నారన్నారు. జాతీయ, అఖిల భారత స్థాయిల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి ఎస్.కృష్ణదీపక్‌రెడ్డి, డైరెక్టర్లు సుగుణ, శృతి, ప్రిన్సిపాల్ మొయినా, సమన్వయకర్త లక్ష్మీకుమార్, అకడమిక్ డైరెక్టర్ రాఘవరెడ్డి, గంగిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఐఐటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ ఫణీంద్ర అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో 'తిరుమల' విజయభేరి

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్ఠాత్మక జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ, మెడికల్ అకాడమీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్టు తిరుల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు కె.ప్రణీత్ (2), కె.యశ్వంత్ సాత్విక్ (3), పి.శరత్ సంతోష్ (9), వి.తేజశ్రీ (18), టి.జశ్వంత్‌దొర (30), కె.అభినవ్ (45), కె.యశ్వంత్‌రాజా (46), జి.సంతోష్‌రాజా (66), ఇ.వర్షిత్ (75), ఎం.కారుణ్యరాజ్ (86), కె.వెంకటరామ వినీష్ (100), జి.కార్తీక్ (120), వి.రామ సాయి వరుణ్ (153), జి.చేతన్ నాగఅనిరుధ్ (154), కె.శంకర్ మాణిక్ (191), పి.జశ్వంత్‌సాయి చరణ్ (219), ఎం.విశ్వనాథ నాగసాయిరామ్ (224), డి.ఆశిష్‌సాయి శ్రీకర్ (235), కె.సాయి సృజన (236), సీహెచ్ సాయిచరణ్ (242), వై.దేవేష్ రుత్విక్ (246), పి.ప్రవీణ్ రుద్రేష్ (247) ర్యాంకులు సాధించారు. వీరితో పాటు పలువురు 292, 310, 313, 319, 326, 331, 338, 349, 366, 391, 395, 403, 429, 444, 465, 473 ర్యాంకులు పొందారు. 1000లోపు 58, 5000లోపు 254, 10000లోపు 417, 20000లోపు 654 మందికి ర్యాంకులు వచ్చాయి. కోచింగ్ తీసుకున్న విద్యార్థుల్లో 1,620 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత పొంది 93శాతం సక్సెస్ రేటు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్లతో కలిసి తిరుమలరావు అభినందించారు.



అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో తిరుమల విద్యా సంస్థల చైర్మన్ తిరుమలరావు

రెలిజియస్ చారిటబుల్ సంస్థగా సత్యదేవుడి ఆలయం రిజిస్ట్రేషన్

దాతలకు 80 (జి), 12 (ఎ) ఆదాయపు పన్ను మినహాయింపు

అన్నవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి ఆలయానికి రెలిజియస్, చారిటబుల్ ట్రస్టుగా రిజిస్ట్రేషన్ కల్పించారు. దీంతో ఇప్పటికే 80(జి) ద్వారా ఆదాయపు పన్ను మినహాయింపు ఉండగా ఇకపై 12(ఎ) ఆదాయపు పన్ను చట్టం కలిగి ఉంటుంది. దాతలు వివిధ సేవా పథకాల నిమిత్తం విరాళాలు అందించి ఆదాయపు పన్ను మినహాయింపు పొందవచ్చని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీర్ల సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

గోవిందా... గోవింద

వాడపల్లికి పోటెత్తిన భక్తులు

శనివారం ఒక్కరోజు ఆదాయం రూ.47.18 లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, భాలబోగంలను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకుని తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.47.18 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

వాడపల్లి క్షేత్రానికి హైకోర్టు జడ్జి టి.రాజశేఖరరావు విచ్చేశారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి వేంకటేశ్వరస్వామిని దర్శనం చేయించారు. ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.



ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కార్మికులకు దన్ను 'ఈ-శ్రమ్'

- ఉచితం.. ఆటో రెన్యూవల్
- స్వీయ నమోదుకు అవకాశం
- ప్లాట్‌ఫాం వర్కర్లకు ప్రత్యేక నమోదు
- సంక్షేమ, సామాజిక భద్రత కోసం కేంద్ర ప్రభుత్వ పథకాలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రెక్కాడినా డొక్కాడుతుందని నమ్మకం లేని బతుకులు. ఆ రోజు చేతికి పని దొరికితే నాలుగు మెతుకులు కడుపులోకి వెళ్లినట్లే. పని చేసినంతకాలం అప్పుల జీవితం. కళ్లు మూశాక కుటుంబాలకు కరువయ్యే ఊతం. ఆసరా కోసం ఆశగా చాపే చేతులు.. వారే అసంఘటిత రంగ కార్మికులు. కష్టాలతో సహవాసం.. కన్నీళ్ల జీవితం. ప్రభుత్వాలు విపత్తుల వేళ ఆదుకోవాలన్నా ఇంత కాలం ఆయా కార్మికుల గురించి ఎలాంటి సమాచారం లభ్యత లేదు. అసలు వాళ్లను ప్రత్యేకంగా పట్టించుకున్న వారే లేరు. అయితే.. వారికి భవిష్యత్తులో దన్ను కాబోతోంది 'ఈ-శ్రమ్' కార్డు. కరోనా విపత్తు వేళ అసంఘటిత రంగ కార్మికులను ఆదుకుందామన్నా ప్రభుత్వాలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వాటిని అధిగమించడానికి, సామాజిక భద్రత కల్పించి, సంక్షేమ పథకాల్లో మరింతగా భాగస్వాములను చేయడం ద్వారా వారి బతుకుల్లో వెలుగులు నింపడానికి కేంద్ర ప్రభుత్వం కేంద్రీకృత డేటా బేస్‌ని రూపొందిస్తోంది. తర్వాత పలు విధా లుగా లబ్ధి చేకూర్చే అవకాశం ఉంది. అందువల్ల 'ఈ-శ్రమ్' కార్డు.. భవిష్యత్తులో కార్మికులకు దన్ను కాబోతున్నాయనడంలో సందేహం లేదు. ఈ కార్డు పొందడానికి ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. పైగా ఆటో రెన్యూవల్ సదుపాయం వల్ల రెన్యూవల్ చేసుకోవాల్సిన అవసరం ఉండదు.



ఎవరు అర్హులు?

16-59 ఏళ్ల మధ్య వయసు కలిగిన భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు, వ్యవసాయ కూలీలు, ఇటుక, సున్నపు బట్టీ కార్మికులు, మత్స్యకారులు, కుమ్మరి, స్వర్ణకారులు, మంగళి, చర్మకారులు, రజకులు, ఉపాధి కూలీలు, ఆశా వర్కర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథక వర్కర్లు, ఇళ్లల్లో పని చేసేవారు, వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, కల్లుగీత కార్మికులు, రిక్షా కార్మికులు, కళాకారులు, బీడీ కార్మికులు, చెత్త సేకరించే వారు, దుకాణలు, సంస్థల్లో పని చేసే కార్మికులు, వలస కార్మికులు, ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని వారు ఇందుకు అర్హులు.

ఎక్కడ.. ఏమి కావాలి?

ఈ-శ్రమ్ కార్డు కోసం సరమళమైన మోదు ప్రక్రియ ఉంటుంది. కాబట్టి సొంతగా చేసు కోవచ్చు. లేదా అన్ని గ్రామ/వార్డు సచివాలయాలు, సీఎస్‌సీ సెంటర్లు, కార్మిక శాఖ కార్యాల యాల్లోనూ నమోదు చేసుకో వచ్చు. నమోదు కోసం ఆధార్ కార్డు, బ్యాంకు ఎకౌంటు జిరాక్సు, సెల్‌ఫోన్ నెంబరు, నామినీ పేరు, పుట్టిన తేదీ వివరాలు ఉంటే సరిపోతుంది.

సాధారణ కార్మికులకు ప్రయోజనం..

ప్రయోజనాలు 2022 మార్చి 31కి ముందు నమోదైన కార్మికులు ప్రమాదవశాత్తూ మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ.2లక్షల ఆర్థిక సహాయం అందుతుంది. పాక్షిక అంగవైకల్యానికి గురైతే రూ.1లక్ష వస్తుంది. రేలషన్ కార్డు లేని వారికి వాటిని జారీ చేస్తారు.

వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు ఉంటాయి.

ప్లాట్‌ఫాం వర్కర్లకు ప్రత్యేకంగా..

ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలు, యాప్‌ల ఆధారంగా వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. వీరిని జిగ్ వర్కర్లని కూడా అంటారు. అయితే వారికి ఏదైనా ప్రమాదం ఎదురైతే ఆదుకొనే వారు ఎవరూ ఉండరు. కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉంది. ఇటీవల కొంతమూరులో ఓ బైక్ షేర్ యాప్ వర్కర్‌కి రోడ్డు ప్రమాదం జరిగి ప్రాణాలు వదిలాడు. ఇన్సూరెన్స్ వంటివి లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. అదే ఈ-శ్రమ్ కార్డు పొంది ఉంటే రూ.5లక్షల బీమా సొమ్ము వచ్చేది. అంతే కాకుండా వీరిని ప్రత్యేకంగా ఆదుకొనే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. అయితే, వీరి కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లోనే ప్రత్యేక నమోదు లింక్‌ని ఉంచారు. సాధారణ కార్మికుల మాదిరిగా నమోదు చేసుకోకూడదు. ప్లాట్‌ఫాం వర్కర్ల రిజిస్ట్రేషను ద్వారా మాత్రమే నమోదు చేసుకోవాలి. అమె జాన్, స్విగ్గీ, జొమాటో, బిగ్ బాస్కెట్, ర్యాపిడో, ఉబర్, ఓలా, ఫ్లిఫ్‌కార్ట్, బ్లింకిట్ వంటి వాటిలో పని చేస్తున్న వారందరూ అర్హులే కాకుండా రూ.5లక్షల వరకూ బీమా సదుపాయం ఉంది. వీళ్ల రిజిస్ట్రేషన్‌కి ఈ-శ్రమ్ పోర్టల్‌లో 'ప్లాట్ ఫాం వర్కర్ కార్డు' అని కనిపిస్తుంది. దాని ద్వారా వివరాలను నమోదు చేసి కార్డు పొందవచ్చు.

ప్రతి కార్మికుడికీ ఉండాలి

ప్రతి కార్మికుడూ, ప్లాట్‌ఫాం వర్కర్ 'ఈ-శ్రమ్' కార్డును పొందాలి. చాల సులభమైన ప్రక్రియ. ఎవరికి వారు నమోదు చేసుకోవచ్చు. ఇప్పటి వరకూ 3.50లక్షల మంది రిజిస్ట్రేషను చేసుకున్నారు. మిగతా వారు కూడా వెంటనే నమోదు చేసుకోవాలి. వారి సహ కార్మికులు కూడా నమోదు చేసుకొనే విధంగా చొరవ చూ పాలి. ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. నమోదుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం.

బీఎస్ఎం వలీ, సహాయ కార్మిక కమిషనర్, తూర్పు గోదావరి

సందేహాలకు ఫోన్ నెంబర్లు

ఏదైనా సందేహాలు ఉంటే 9492555064/65/66/67 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

నమోదు చాలా సులభం...

ఈ-శ్రమ్ కార్డు కోసం నమోదు చేసుకోవడం చాలా సులభం. అధికారిక వెబ్‌సైటు https://eshram.gov.inలో సెల్ ఫోన్ నెంబరుతో లింక్ అయి ఉన్న ఆధార్ నెంబరు, అక్కడే కనబడే కేప్చా కోడ్ నమోదు చేయాలి. ఈపీఎఫ్‌వో, ఈఎస్‌ఐపై నో అని ఎంచుకొని సెండ్ ఓటీపీపై క్లిక్ చెయ్యాలి. సెల్ నెంబరుకు వచ్చిన ఓటీపీ నెంబరును ఎంటర్ చేసి టెర్మ్స్ అండ్ కండీషన్స్ బాక్స్‌ని టిక్ చేసి సబ్మిట్ చేయాలి. మళ్లీ వచ్చిన ఓటీపీని, కాప్చా కోడ్‌ని ఎంటర్ చేసి వ్యాలిడేట్ బాక్స్‌పై క్లిక్ చేసి కంటిన్యూ టు ఎంటర్ అదర్ డిటైల్స్ బాక్స్‌పై కూడా క్లిక్ చేసి వివరాలు నమోదు చెయ్యాలి. నామినీ డిటెయిల్స్ అని వస్తుంది. వివరాలు ఇచ్చినా ఇవ్వకపోయినా ఫర్వాలేదు. సేవ్ అండ్ కంటిన్యూ తర్వాత స్టేట్, డిస్ట్రిక్ట్, ప్రస్తుత అడ్రస్, స్టేయింగ్ ఎట్ కరెంట్ లొకేషన్, పర్మనెంట్ అడ్రస్‌ల, చదువు, నెలవారీ ఆదాయం, వృత్తి, నైపుణ్యాలు, ప్రాథమిక వృత్తి, వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను తప్పనిసరిగా నమోదు చేసి సేవ్ అండ్ కంటిన్యూ బటన్ నొక్కాలి. బ్యాంక్ డిటెయిల్స్ ఇవ్వడం తప్పనిసరికాదు. తర్వాత రిజిస్ట్రేషన్ పూర్తయి ప్రివ్యూ అని వస్తుంది. మార్పులు ఉండే ఎడిట్ బటన్ ద్వారా చేసుకోవచ్చు. లేదా అండర్ టేకింగ్ బాక్సులో టిక్ చేసి సబ్మిట్ చేసేసి 'ఈ-శ్రమ్' కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న

454 సెల్‌ఫోన్లు అందజేత



కాకినాడలో మహిళకు ఫోన్ అందజేస్తున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఖరీదైన సెల్‌ఫోన్లు

కాకినాడ క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అపహరణకు గురైన లేదా పోగొట్టుకున్న రూ.77.18 లక్షలు విలువైన 454 ఖరీదైన సెల్‌ఫోన్లను కాకినాడ జిల్లా పోలీసులు రికవరీ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం వాటిని బాధితులకు ఎస్పీ జి.బిందుమాధవ్ అందజేశారు. ప్రస్తుతం అందజేసిన సెల్‌ఫోన్లతో కలిపి ఇప్పటివరకు మొత్తం 2,551 రికవరీ చేశామని, మరో నెలలో ఇంకె 600 వరకు బాధితులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సైబర్ మోసాల నుంచి రక్షణ కోసం వీడియో కాల్స్, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, సైబర్ మోసాలకు గురైతే సైబర్ క్రైం హెల్ప్ లైన్ 1930 లేదా పోలీస్ స్టేషన్లో సంప్రదించాలన్నారు. వేసవి నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ పాల్గొన్నారు.

దీక్ష విరమణకు బీచ్‌కు వెళ్లి.. సముద్రపు నీటికి ఉక్కిరిబిక్కిరై..

ఒడ్డుకు వచ్చి చికిత్స పొందుతూ యువకుడి మృతి

ప్రాణాలతో బయటపడిన మరో ఇద్దరు



ఫైల్‌ఫొటో



మృతిచెందిన ఉదయ్‌కుమార్

మొగల్తూరు/నల్లజర్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా పేరుపాలెం బీచ్‌కు దీక్ష విరమణకు వెళ్లిన ఓ యవకుడు మృతిచెందాడు. వివరాల ప్రకారం.. ఏటా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి వేలాదిగా క్రైస్తవ విశ్వాసులు 40 రోజుల పాటు దీక్ష చేసి గుడ్‌ఫ్రైడే రాత్రి సమయంలో పేరుపాలెం తీరంలోని వేళాంకిణ్ణి మాత ఆలయం వద్ద దీక్ష విరమణ చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది శుక్రవారం రాత్రి వచ్చిన సందర్శకుల్లో శనివారం వేకువ జామున సముద్ర స్నానానికి దిగిన ఇద్దరు యువకులు ఎక్కువ సముద్రం నీరు తాగడంతో ఉక్కిరిబిక్కిరికి లోనై ఒడ్డుకు ప్రాణాలతో కొట్టుకువచ్చారు. వారిలో ఒక యువకుడు తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన సంకెళ్ల ఉదయ్‌కుమార్(19). అతడిని స్థానికులు, పోలీస్ సిబ్బంది మొగల్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉండడాన్ని గుర్తించి నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం చేస్తుండగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇదే సంఘటనలో ఉన్న తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి సికింద్రర్‌ను నరసాపురం ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొంది సాయంత్రం ప్రకాశరావు పాలెం వచ్చాడు. అదేవిధంగా తూర్పు గోదావరి జిల్లా ఆవపాడు చెందిన యువకుడు కోడే పవన్ కుమార్ కూడా నీటిలో మునగడంతో నరసాపురం ఆసుపత్రికి, మెరుగైన వైద్య నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం నిలకడగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ఉదయ్‌కుమార్ తండ్రి చిన్నతనంలోనే మృతిచెందగా తల్లి విజయలక్ష్మి ఆలనాపాలన చూస్తోంది. మృతుడి అక్క విజయలక్ష్మి ఫిర్యాదుతో మొగల్తూరు 2వ ఎస్‌ఐ వై.నాగలక్ష్మి కేసు నమోదు చేశారు.

టెన్త్ ఫెయిల్ అవుతాననే భయంతో..

విద్యార్థిని ఆత్మహత్య

అంబాజీపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షలు సరిగ్గా రాయలేదని మార్కులు తక్కువ వస్తాయనే భయంతో ఓ విద్యార్థిని శనివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ కె.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మం డలం గంగలకుర్రు పరిధిలోని 15 ఏళ్ల బాలిక ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షలు రాసింది. పరీక్ష ఫలితాలు త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో తక్కువ మార్కులు వచ్చి ఫెయిల్ అవుతాననే భయంతో ఇంటి వద్దే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందింది. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

బాలికను వేధించిన యువకుడిపై పోక్సో కేసు

ద్రాక్షారామ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం జగన్నాయకుల పాలెం గ్రామానికి చెందిన యువకుడిపై ద్రాక్షారామ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాలు ప్రకారం.. ఒక బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, తన కోరిక తీర్చమని వేధించడంపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో నలుగురి అరెస్ట్

10 కిలోలు స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కంబాలచెరువు హైటెక్ బస్టాండ్ సమీపంలో నలుగురిని అదుపులోకి తీసుకుని పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఒడిస్సాకు చెందిన రాజ్‌రాయ్, మందోష్ మండల్‌లు, రాజమహేంద్రవరానికి చెందిన దొందా మల్లేశ్వరరావు, దొండా కొండల రావు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద గంజాయి ఉన్నట్టు గుర్తించారు. వారిని అరెస్టు చేసి వారి నుంచి పది కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

జనావాసాల్లోకి కొండ గొర్రె

స్వల్ప గాయాలు



గాయపడిన కొండ గొర్రె

మారేడుమిల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అటవీప్రాంతం నుంచి మారేడుమిల్లి గ్రామంలోకి కొండ గొర్రె వచ్చింది. గ్రామంలో సీఎస్‌ఐ చర్చి సమీపంలో కుక్కలు తరుముకుంటూ రావడంతో గొర్రెకు స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారమివ్వడంతో సంఘటా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి సమీపంలోని అటవీప్రాంతంలోకి తీసుకెళ్లి వదిలిపెట్టారు.

బుర్రిలంకలో తాటాకిల్లు దగ్ధం

కడియం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంకలో పంతాల కొండారత్నంకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. దుస్తులు, సామగ్రి, నగదు కాలి బూడిదయ్యాయి. స్థానికుల సమాచారంతో రాజమహేంద్రవరం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విషయం తెలిసి సర్పంచ్ ఇన్‌చార్జి పాటంశెట్టి రాం జీ రూ.10 వేల అందించారు. అలాగే నూనె ప్రభు ఆర్థిక సాయం చేశారు.



కాలిబూడిదైన దృశ్యం

సాంస్కృతిక పునరుజ్జీవనానికి గ్రంథాలయాలు దోహదం

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

కాకినాడ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక పునరుజ్జీవనానికి గ్రంథాలయాలు దోహదపడతాయని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. కాకినాడ-సామర్లకోట రోడ్డులోని ఐడియల్ డిగ్రీ కళాశాలలో ఏపీ గ్రంథాలయ పునర్వికాస వేదిక, ఐడియల్ కళాశాల శనివారం సంయుక్తంగా నిర్వహించిన సదస్సుకు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం మార్గదర్శకాలు కల్పించి గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏపీ గ్రంథాలయ పునర్వికాస వేదిక కన్వీనర్ వి.శివప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 27న విజయవాడలో జరిగే సభలో కవులు, రచయితలు, మేధావులు పాల్గొని గ్రంథాలయాల సమస్యల పరిష్కారానికి డిమాండ్లు తెలియజేయాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంఘ అధ్యక్షురాలు డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, సూర్యభాస్కర్, సుబ్బరాజు, సుబ్బారావు, ఏ.శ్రీనివాస్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి

ఆర్డీ నాగనరసింహారావు

ముమ్మిడివరంలో సమీక్షా సమావేశం

ముమ్మిడివరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పన్నులు సకాలంలో వసూలు చేసి మున్సిపాలిటీల అభివృద్ధికి సహకరిస్తూ అదేస్థాయిలో ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన, సకాలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పురపాలక శాఖ ప్రాంతీయ సంచాలకులు సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అమలాపురం, ముమ్మిడివరం, మండపేట, రామచంద్రపురం, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాలిటీల కమిషనర్లు, ఆయా పురపాలక సంఘ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగనరసింహారావు మాట్లాడుతూ పట్టణాల్లో ఆదాయ వనరుల పెంపు, అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించి కౌన్సిల్ ఆమోదంతో ముందుకు సాగాలని సూచించారు. ఆస్తి పన్ను, తాగునీరు, ట్రేడ్ లైసెన్సు పన్నులు నూరుశాతం వసూలు పూర్తి చేయాలన్నారు. ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం 50శాతం వడ్డీ రాయితీని కల్పించిన విషయంపై వారికి అవగాహన కల్పించాలన్నారు. పట్టణాలకు ఆదాయం వచ్చే భవనాలు, ఇతర ఆదాయ వనరులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఘన, ద్రవ, వ్యర్థాల నిర్వహణ, భూసంబంధిత సమస్యలపై ఆయన సమీక్షించారు. అమృత్, ఇతర పథకాల పురోగతి బడ్జెట్ అంచనాల ప్రకారం ఆదాయ వ్యయాలను పురపాలక సంఘాల వారీగా ఆర్డీ సమీక్షించారు. పట్టణాల సుందరికీకరణ, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా సక్రమంగా ప్రజలకు అందించాలన్నారు. పట్టణ ప్రణాళికావిభాగం పనితీరు, సమస్యలపై సమీక్షించి పలుసూచనలిచ్చారు. ఈ ఆఫీసు ఆచరణ విధిగా నిర్వహించాలన్నారు. మురుగుకాల్వల్లో పూడిక తొలగింపు, పట్టణాల్లో ఎంఎస్ఎంఈ కార్యాచరణ, కుటుంబాల గుర్తింపు తదితర విషయాలపై చర్చించారు. వీధి కుక్కలు, పశువుల నిర్మూలనకు చర్యలు, వార్డు సచివాలయ సర్వే రిపోర్టు, హౌస్ హోల్డ్ సర్వే, ఆధార్‌లేని పిల్లకు ఆధార్ చేయించడం తదితర విషయాలపై సమీక్షించారు. సమావేశంలో ముమ్మిడివరం, అమలాపురం, రామచంద్రపురం, కొవ్వూరు, మండపేట, నిడదవోలు కమిషనర్లు పి.రవివర్మ, కేవీఆర్ రాజు, వి.అయ్యప్పనాయుడు, టీవీ రంగారావు, పీఎల్ఎస్ఎస్ కృష్ణవేణిలతో పాటు మున్సిపాలిటీల డీఈలు, అసిస్టెంట్ ఇంజనీర్లు, మేనేజర్లు, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లు, రెవెన్యూ, శానిటరీ ఇనస్పెక్టర్లు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగనరసింహారావు



సమావేశంలో పాల్గొన్న కమిషనర్లు, అధికారులు

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య



మరణించిన సాయికుమార్

కొవ్వూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం అందించిన వివరాల ప్రకారం.... తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరుకి చెందిన లంక నాగ శ్రీసత్య సాయికుమార్ (22) సూరంపాలెంలోని ఓ కళాశాలలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సాయికుమార్ తల్లికి ఇటీవల కంటికి శస్త్రచికిత్స చేయించడంతో తల్లితండ్రులు గత కొద్ది రోజులుగా కొవ్వూరు పట్టణంలోని తన కుమార్తె ఇంటి వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం సాయం త్రం సాయికుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయికుమార్ స్నేహితుడు శ్యాంసన్ ఇంటికి వచ్చి పిలవగా ఎంతకీ పలకకపోవడంతో కిటికీలోంచి చూసేసరికి విగతజీవిగా కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడి తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

శృంగార వల్లభస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

రూ.2,91,596 ఆదాయం

పెద్దాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువై తొలి తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీదేవి, భూదేవి సమేత శృంగారవల్లభస్వామిని శనివారం సుమారు పదిహేను వేలమంది దర్శించుకున్నారు. రూ.2,91,596 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. తుని మండలం రాజుపేటకు చెందిన అల్లు రామకృష్ణ, అరుణ స్వామివారికి 2.690 కిలోల వెండి ఆభరణాలు సమర్పించినట్టు ఆయన చెప్పారు.

పాస్టర్ ప్రవీణ్ మరణించిన ప్రదేశంలో

కొవ్వొత్తులతో క్రైస్తవుల నిరసన ర్యాలీ





కొంతమూరు రోడ్డులో ర్యాలీ చేసి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణించిన ప్రదేశం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు-దివాన్ చెరువు రోడ్డులో క్రైస్తవులు కొవ్వొత్తులతో భారీ నిరసన ర్యాలీ చేశారు. ప్రవీణ్ మరణం హత్యే అని నమ్మినవాళ్లు ఈ ర్యాలీలో పాల్గొనాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం సాయంత్రం వేలాది మంది క్రైస్తవులు ప్రవీణ్ మరణించిన సంఘటన స్థలానికి చేరుకుని కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. ఆ ప్రాంతానికి చేరుకున్న మాజీ ఎంపీ హర్షకుమార్, ఆయన తనయుడు జీవి శ్రీరాజ్, జిల్లాలోని రాజమహేంద్రవరం, ఇతర ప్రాంతాలు, తెలంగాణ నుంచి వచ్చిన పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేస్తుండగా హర్షకుమార్‌ను, నాయకులు ఇసుకపట్ల రాంబాబు, నక్కా వెంకట రత్నం, జంగా బాబురావు, పాలకొల్లుకు చెందిన రమేష్‌ని పోలీసులు అదుపులోకి తీసుకుని కొందరిని...

ఫ్లెక్సీ వద్ద నివాళి

మాజీ ఎంపీ హర్షకుమార్ అరెస్ట్, విడుదల

తమందిని రాజానగరం పోలీస్ స్టేషన్‌కు, మరి కొంతమందిని ఇతర పోలీస్ స్టేషన్లకు తరలించారు. క్రైస్తవులు బారికేడ్లను తోసుకుని నేరుగా ప్రవీణ్ పగడాల మరణించిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రవీణ్ ఫ్లెక్సీ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. నివాళులర్పించారు. ముగ్గురు డీఎస్పీలు, ముగ్గురు సీఐలు వంద మందికి పైగా పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిస్థితి అదుపు తప్పకుండా వ్యవహరించారు. హర్షకుమార్‌ను వేమగిరి వైపు తీసుకువెళ్లి తిరిగి ఇంటి వద్ద దించేశారు. అయితే ఆయన నిర్వహించిన కొవ్వొత్తుల నిరసన ర్యాలీకి అనుమతిలేదని రాజానగరం పోలీసులు నోటీసులు ఇచ్చారు.

పోరాటం ఆగదు : హర్షకుమార్

పాస్టర్ ప్రవీణ్ పగడాలను హత్య చేసి రోడ్డు ప్రమాదంగా మార్చి క్రైస్తవులకు అన్యాయం చేస్తే దానిని నిలదీసి కొవ్వొత్తుల ర్యాలీ చేసి నివాళులర్పించేందుకు వెళ్లిన తనను వంద మంది పోలీసులతో అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. శనివారం రాత్రి తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. బ్రిటీష్ పాలకుల కంటే దారుణం ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. అరెస్టులకు భయపడని తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు

కోడి గుడ్డుపై ఏసుక్రీస్తు చిత్రం

రాయవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు పునరుత్థానాన్ని పురస్కరించుని నిర్వహించే ఈస్టర్ పండగ సందర్భంగా శనివారం కోనసీమ జిల్లా రాయవరం గ్రామానికి చెందిన చిత్రకారుడు ఇందుగమెల్లి సౌదాసాగర్ కోడి గుడ్డుపై ఏసుక్రీస్తు చిత్రం గీశాడు. వివిధ రకాల రంగులతో సుమారు 2 గంటల పాటు శ్రమించి చిత్రీకరించాడు.



కోడిగుడ్డిపై సాదాసాగర్ గీచిన ఏసుక్రీస్తు చిత్రం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి



కళాశాల స్వర్ణోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసు

ప్రతి విద్యార్థి విజయం దిశగా సాగాలి

ఎస్‌కేవీటీ వార్షికోత్సవ సభలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి తన తప్పులను తెలుసుకుని సరిదిద్దుకుంటూ విజయం దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం, స్పోర్ట్స్ డే సందర్భంగా జరిగిన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమాజ శ్రేయస్సు, విద్య కోసం తన యావదాస్తిని ధారబోసిన వీరేశలింగం పంతులు కళాశాలలో చదువుతున్నందుకు విద్యార్థులంతా గర్వించాలన్నారు. ప్రతి విద్యార్థి ఆయన గృహాన్ని, ఆయన సంస్థలను సందర్శించే విధంగా కరుక్యులమ్ ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. డిగ్రీ కళాశాల ఆర్‌జేడీ ఎస్.శోభారాణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాలను ఏర్పరచుకుని నిబద్ధతతో కష్టపడాలన్నారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి కళాశాలకు గుర్తింపు తేవాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ జి.శరత్‌బాబు మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల స్వర్ణోత్సవం ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ వై.స్వర్ణశ్రీ, పీవీటీసీ సభ్యులు ఏఈహెచ్ అర్మాస్, కె.సత్యనారాయణ, సూపరింటెండెంట్ బీహెచ్‌వీ సుబ్రహ్మణ్యమూర్తి, పీవీబీ సంజీవరావు, ఆచంట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్య, క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి చేతులమీదుగా నగదు పురస్కారాలను అందజేశారు. తెలుగు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినిలు ప్రదర్శించిన ఆంధ్రనాట్యం ఆకట్టుకుంది.

ప్రతిభావంతులకు నగదు బహుమతులు

యాదవ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు

దివాన్‌చెరువు ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేయాలని తమ కార్పొరేషన్ తొలి సమావేశంలో తీర్మానించినట్టు రాష్ట్ర యాదవ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు(నాగు) తెలిపారు. విజయవాడలో ఇటీవల జరిగిన సమావేశంలో చేసిన తీర్మానాలను శనివారం స్థానిక విలేకరులకు వివరించారు. గ్రూప్స్, సివిల్స్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు యాదవ స్టడీ సెంటర్లు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పుకొనేందుకు, మినీ సూపర్‌బజార్లకు, బర్రెలు, గొర్రెలు, మేకలు పెంపకానికి రాయితీ రుణాలు ఇవ్వాలని తీర్మానించి చెప్పారు. యాదవ, బీసీల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని పేర్కొన్నారు.

విద్యా విధానంలో సమూల మార్పులు

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విద్యావిధానంలో సమూల మార్పులు తీసుకురావడానికి కూటమి శ్రీకారం చుడుతోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. పందలపాక జడ్పీ ప్లస్ పాఠశాలలో ఇటీవల ఇంటర్ సీఈసీలో పాఠశాలకు చెందిన స్టేట్ ర్యాంకర్ లీలాశ్రావణి, నియోజకవర్గంలో ఎంపీసీలో ప్రథమ స్థానంలో నిలిచిన దేవిలకు సన్మాన సభను శనివారం ఏర్పాటు చేశారు. దీనికి ఎమ్మెల్యే నల్లమిల్లి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ శ్రావణి, దేవిలను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకుని రాణించాలన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సాధనకు ఉపాధ్యాయులందరూ విద్యార్థుల్లో అవగాహన కలిగించాలన్నారు. అనంతరం పాఠశాల విద్యాకమిటీ ఏర్పాటు చేసిన రూ.25 వేలను శ్రావణికి, రూ.10 వేలను దేవికి ఎమ్మెల్యే అందజేశారు. అలాగే ఇందుకు కారకులైన ఆరుగురు అధ్యాపకులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా పీడీ యువరాజారెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కోసం విద్యార్థులు చేసిన మానవహారం అందర్నీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, ఎస్ఎంసీ ఛైర్మన్ కోనాల సత్తిరాజు, ఎంఈవో పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు వీర్రెడ్డి, జయకృష్ణారెడ్డి, వల్లీషా, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడూ ఆస్తి పన్నుల చెల్లింపునకు అవకాశం: కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగర పరిధిలో ఆస్తి పన్నులు చెల్లించాల్సిన వారు ఆదివారం కూడా చెల్లింపులు చేయవచ్చని, సెలవు రోజు కూడా కౌంటర్లు తెరిచే వుంటాయని మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదిలోగా 2024-25 ఆర్థిక సంవత్సరం బకాయిలున్న పన్నులపై వడ్డీ 50శాతం, 2025-26 పన్నులు ఏకమొత్తంలో చెల్లించే వారికి పన్నులో 5శాతం రాయితీ ఇస్తున్నామని, దీనిని చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీడీపీ గ్రామ కమిటీల నియామకం

నెలాఖరుకు పూర్తిచేయాలి: మనోజ్‌రెడ్డి

రంగంపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాల్లో టీడీపీ కమిటీల నియామకం ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని వడిశలేరు గ్రామంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ప్రతి 30 మందికి ఒక సాధికారిక సభ్యుడు ఉండే విధంగా కమిటీలను కూడా ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో పార్టీ సభ్యత్వం తీసుకున్నవారందరికీ గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, మండలాధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, అడబాల వెంకట్రావు, ఉద్దండ్రావు శ్రీను, ఉండవిల్లి గిరిబాబు, మద్దిపాటి సత్తిబాబు, పోతుల చిన్నికాపు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల కేటాయింపులో వివక్ష సరికాదు'

దివాన్‌చెరువు, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): అన్నీ ప్రభుత్వ పాఠశాలలే అయినప్పటికీ ఒక్కో పాఠశాలలో ఒక్కో విధంగా ఉపాధ్యాయుల కేటాయింపు విధానం అనుసరిస్తూ వివక్ష ప్రదర్శించడం ప్రభుత్వానికి ఎంతవరకూ న్యాయమని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు ప్రశ్నించారు. దివాన్‌చెరువులో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి ప్రభుత్వం తాజాగా జారీచేసిన మార్గదర్శకాలు విస్మయం కలిగిస్తున్నాయని ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కేటాయింపుకు ఒకే విధానం అనుసరించాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణతోనే ఉపకులాలకు సమన్యాయం

జిల్లా క్రిస్టియన్ సెల్ ప్రధాన కార్యదర్శి విజయరావు



వడిశలేరు సమావేశంలో మాట్లాడుతున్న విజయరావు

రంగంపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతోనే 59 ఎస్సీ ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందని జిల్లా క్రిస్టియన్ సెల్ ప్రధాన కార్యదర్శి విజయరావు అన్నారు. శనివారం వడిశలేరు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కళ్యాణ్‌కి, 30 ఏళ్ల పాటు మాదిగ దండోరా ఉద్యం నడిపించిన కృష్ణ మాదిగకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 1994లో మంద కృష్ణ ఎస్సీ వర్గీకరణకు పోరాటం ప్రారంభించినపుడు అధికారంలో ఉన్న టీడీపీ జస్టిస్ రామచంద్ర రాజు కమిటీని వేసిందని, ఇప్పుడు మళ్లీ టీడీపీ అధికారంలో ఉండగానే ఎస్సీ వర్గీకరణ జరిగిందని కూటమి ప్రభుత్వానికి విజయరావు కృతజ్ఞతలు తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో షిర్డిసాయి విజయభేరి



జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ రెండో సెషన్ ఫలితాల్లో షిర్డిసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు వివిధ కేటగిరిలలో అత్యుత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. తమ లక్ష్యా ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఐ.శ్రీసాయి హిమ్నీష్ 15వ ర్యాంకు, సీహెచ్ మోక్షిత్ 35వ ర్యాంకు, ఎం.మధులికరెడ్డి 169 ర్యాంకు, మోహన్ శ్రీరామ్‌జీ 287 ర్యాంకు సాధించారన్నారు. 10 మంది విద్యార్థులు 1000 లోపు ర్యాంకులు, 23 మంది 2000 లోపు, 45 మంది 5000 లోపు, 64 మంది 10,000 లోపు, 88 మంది 20,000 లోపు ర్యాంకులు సాధించినట్టు శ్రీవిద్య వివరించారు. మొత్తం 245 మంది విద్యార్థులు హాజరు కాగా, 186 మంది విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించవచ్చన్నారు. విజేతలైన విద్యార్థులను, అందుకు కృషిచేసిన అధ్యాపక బృందాన్ని ఆమె తోపాటు విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, లక్ష్యా అకాడమీ డీన్ చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధన

సమష్టి బాధ్యత

- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు
- పలుచోట్ల అవగాహన ర్యాలీలు, మానవహారాలు



రాజానగరంలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల



పందలపాకలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రాజానగరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సమష్టి బాధ్యతతోనే స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధ్యపడుతుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను శనివారం పలుచోట్ల నిర్వహించారు. ఈ సందర్భంగా రాజానగరంలో అధికారులతో కలిసి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాల పరిశుభ్రత పాటించడం ప్రతిఒక్కరి కర్తవ్యంగా గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు.అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించి, నూతన వస్త్రాలు అందజేశారు. స్థానిక గాంధీ బొమ్మ కూడలిలో అందరితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేపీ ఝాన్సీ, తహశీల్దార్ జీఏఎల్ఎస్ దేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రామభాస్కర్, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

బిక్కవోలు: పందలపాక గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ సబ్బారపు పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విచ్చేసి ప్రసంగించారు. నేడు ఆధునీకరణ పట్ల మొగ్గు చూపడంతో నీరును కొనుక్కొని తాగుతున్నారని, భవిష్యత్తులో గాలిని కూడా కొనుక్కునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ విషయాలను దృష్టిలో వుంచుకుని ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా వుంచుకోవాలని, ఇళ్లలో వున్న ఈ-వేస్ట్‌ను పంచాయతీలకు అప్పగించి గ్రామాలను పరిశుభ్రంగా వుంచాలన్నారు. అందరితో ప్రకృతి పరిరక్షణకు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా గ్రామంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో తాను ఎమ్మెల్యేగా గెలుపొందితే 108 కొబ్బరికాయలు కొడతానంటూ మొక్కుకున్న టీడీపీ నేతలు పడాల అబ్బులురెడ్డి, జక్క శ్రీనివాస్‌ల మొక్కును ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు మొక్కును తీర్చి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే పంచాయితీ ఆవరణలో పోషణ పక్వాడలో భాగంగా ఎంపీపీ తేతలి సుమ, సర్పంచ్ పద్మావతి గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపి చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించారు. అంతకు ముందు పందలపాక గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చినబుజ్జి, కూటమి నాయకులు దుర్గారెడ్డి, పడాల సూర్యనారాయణ రెడ్డి, బోగాది వెంకటరమణ, ఇందల వీరబాబు, ప్రత్యేకాధికారి విజయకుమారి, తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో కరపత్రాలు పంచుతున్న దృశ్యం

ధవళేశ్వరం: ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్ ఆధ్వర్యంలో ఈ-వ్యర్థాలపై అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు. సర్కిల్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారిపై బ్యారేజ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ఈ-వ్యర్థాల వల్ల పర్యావరణ కలిగే నష్టాలు వివరిస్తూ కరపత్రాలు పంచారు. ప్రచారం చేశారు. ప్రతిఒక్కరు ఈ వ్యర్థాల వల్ల పర్యావరణానికి, ప్రజల మనుగడకు జరిగే హానిపై అవగాహన కలిగి ఉండాలని గోపీనాథ్ అన్నారు.

కడియం: కడియంలో ఈ చెక్ అనే థీమ్‌తో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎలక్ట్రానిక్ వేస్ట్ వలన కలిగే ప్రమాదాలు, ప్రజారోగ్యం, పర్యావరణంపై ప్రభావంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో కె.రమేష్ మాట్లాడుతూ పనికిరాని ఎలక్ట్రానిక్ వ్యర్థాలు రేడియేషన్ వలన కేన్సర్, ఇతర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వాటిని పడేయకుండా గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ కౌంటర్‌కు అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, ఎంపీడీవో కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు. జేగురుపాడులో సర్పంచ్ యాదల స్టాలిన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు ద్వారా ఈ-వేస్ట్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించి సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాతూరి రాజేష్; ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలో అధికారులు, వైద్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వారా కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎం.రామకృష్ణారెడ్డి స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలోని భారీ ర్యాలీ జరిపి దేవీచౌక్ వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అనిల్‌కుమార్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేటలో పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీగిరి విచ్చేసి మాట్లాడారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పంచాయతీలకు అందించాలని, వాటిని రెండో దశలో నిర్మూలించడానికి చర్యలు చేపడతామన్నారు. ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల రీసైక్లింగ్ చేయాలి, పరిశుభ్రత విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తదుపరి గ్రామ కార్యదర్శి శ్రీరామమూర్తి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లుతో తయారు చేసిన ఇటుకలను, ఎరువులు చల్లడానికి తయారు చేసిన పనిముట్లను పరిశీలించారు. కార్యక్రమంలో పెండ్యాల బుచ్చిబాబు, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



జేగురుపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు



రంగంపేటలో సామూహిక ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

స్ఫూర్తి ప్రదాత గౌతు లచ్చన్న

వర్ధంతి కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిన సర్దార్ గౌతు లచ్చన్నను స్ఫూర్తిగా తీసుకోవాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా గౌడ, శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక వై-జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి మంత్రి దుర్గేష్, మాజీ ఎంపీ మార్గాని భరత్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్, రెడ్డి రాజు, సూరంపూడి శ్రీహరి, మార్గాని చంటిబాబు, రెడ్డి మణి,డాక్టర్ అన సూరి పద్మలత, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితర ప్రముఖులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మార్గాని భరత్ మాట్లాడుతూ లచ్చన్న తెలుగు జాతికి గర్వకారణమని, ఆయన జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో లోడా అప్పారావు, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ జిల్లా మోర్చా అధ్యక్షురాలు మొన్నే ఉమాదేవి, బొమ్ముల దత్తు, గేడి అన్నపూర్ణరాజు, కోడి ప్రవీణ్‌కుమార్, అత్తిలి రాజు పాల్గొన్నారు. స్థానిక గోదావరి గట్టున ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, కుడుపూడి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు విచ్చేసి లచ్చన్న విగ్రహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ లాలాచెరువు జంక్షన్‌లో గౌతు లచ్చన, పాపన్న గౌడ్, కింజరపు ఎర్రన్నాయుడు విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వాసంశెట్టి గంగాధరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు పాల్గొన్నారు.

వికసిత భారత్ లక్ష్యం కావాలి

ఏబీఆర్ఎస్ఎం జాతీయ సంయుక్త కార్యాచరణ కార్యదర్శి లక్ష్మణ్



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మణ్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వికసిత భారత్ ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని, నేషన్ ఫస్ట్ సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా చేసుకుని అభ్యున్నత భారత నిర్మాణంలో విద్యార్థులు, అధ్యాపకులు కలసి కట్టుగా పనిచేయాలని అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) జాతీయ సంయుక్త కార్యాచరణ కార్యదర్శి గుంత లక్ష్మణ్ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వికసిత భారత్ - 2047 ఉన్నత విద్యాసంస్థల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో లక్ష్మణ్ మాట్లాడుతూ వికసిత భారత్ ఐదు ముఖ్య లక్ష్యాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ 1907లో జరిగిన వందేమాతరం ఉద్యమంలో ఆర్ట్స్ కళాశాల పాత్రను గుర్తు చేశారు. ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం, జగ్గంపేట జేడీసీ ప్రిన్సిపాల్ చెన్నారావు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అన్నపూర్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాకినాడ పీఆర్ కళాశాల హిందీ లెక్చరర్ పి.హరిరామప్రసాద్ రచించిన, అయోధ్య పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో ప్రచురించబడిన సిద్ధాంత వ్యాసగ్రంథం 'ఆంధ్ర సంస్కృతి బనాం రామ్ సంస్కృతి' అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. కామర్స్ అధ్యాపకులు బీపీ నర్సారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

రీజనల్ ఫైర్ ఆఫీసర్ ఎంకు స్వామి



క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంకు స్వామి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం సాధించి రాబోయే ఒలింపిక్స్ గేమ్స్‌లో పాల్గొనే అర్హత సాధించాలని, బంగారు పతకాలు అందుకోవాలని ఏడు జిల్లాల రీజనల్ ఫైర్ ఆఫీసర్ ఎంకు స్వామి అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని మోరంపూడి శ్రీచైతన్యలో బీఎస్ రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ పోటీలను ఉదయం రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడుతూ నేటి బాలలు సెల్‌ఫోన్లలోనే బాల్యాన్ని గడిపేస్తున్నారని, ఈ పరిస్థితి నుంచి మార్పు తీసుకొస్తూ విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో రీజనల్ ఫైర్ ఆఫీసర్ ఎంకు స్వామి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సురేష్, రాజమహేంద్రవరం కాలేజీ ఏజీఎం ఎం.హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చిన్న చిన్న జాగ్రత్తలతో పెద్ద ప్రమాదాల నివారణ

అనపర్తి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) ప్రజలు చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా పెద్ద అగ్నిప్రమాదాలను నివారించవచ్చని అనపర్తి ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శనివారం అనపర్తి ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో అగ్ని ప్రమాదాల నివారణపై వైద్య సిబ్బందికి రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణం తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ప్రాణనష్టం ఏర్పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వేసవిలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు మరింత అప్రమత్తగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా గోపి



కడియం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా కడియపులంక అంబికా నర్సరీ అధినేత, టీడీపీ నాయకుడు బోడపాటి గోపాలకృష్ణ(గోపి)కి అవకాశం దక్కింది. మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా రాజమహేంద్రవరం రూరల్ మండలానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు మార్ని వాసుదేవరావు ఎంపికయిన సంగతి విదితమే. అయితే ఉపాధ్యక్ష పదవి కడియం మండలం కడియపులంకకు చెందిన గోపిని వరించింది. ఈ సందర్భంగా ఆయన తనకు ఈ పదవి లభించడంపై సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిలకు ధన్యవాదాలు తెలిపారు. కాగా గోపి మొదటి నుంచి టీడీపీలోనే కొనసాగుతున్నారు. ఈమె సతీమణి మోహినీ పుణ్యవతి టీడీపీ ఎంపీటీసీగా విజయం సాధించారు. గోపి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. అభినందనలు తెలిపారు.

శ్రీరాంపురంలో షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

దివాన్‌చెరువు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు శివారు శ్రీరాంపురంలో శ్రీషిర్డీసాయినాథుడి ఆలయ రజతోత్సవ శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ హోమం, పూర్ణాహుతి, బాబాకు అభిషేకాలు నిర్వహించారు. బోయిడి వెంకటేష్ దంపతులతో దత్తాత్రేయ హోమం, పూర్ణాహుతి వేదపండితులు జరిపించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన పార్టీ నాసేనకోసం నావంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి బాబాను దర్శించుకున్నారు. వెంకటేష్ దంపతులకు నూతనవస్త్రాలను అందజేశారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి

రాజానగరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 3నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందని, వేసవిలో కూలీలకు అదనపు బోనస్, పనిముట్లు, మజ్జిగ, తాగునీరు తదితర సౌకర్యాలను ప్రభుత్వం తగ్గించిందన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ సభ్యులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: గుడ్ బ్యాడ్ అగ్లీ
సూర్యమినీ	: జాట్, జాక్
సూర్యప్యాలస్	: సిన్నర్స్
స్వామి	: ఓదెల-2
శివజ్యోతి	: అర్జున్ s/o వైజయంతి
అనుశ్రీ(సాయికృష్ణ)	: అర్జున్ s/o వైజయంతి
రాజా	: ఓదెల-2
ఊర్వశి	: మ్యాడ్ స్క్వేర్
రంభ	: అక్కడ అమ్మాయి...
మేనక	: మధురం, డియర్ ఉమ
అప్సర	: అర్జున్ s/o వైజయంతి
కుమారి	: ఓదెల-2
అశోక	: అర్జున్ s/o వైజయంతి
వీఎస్ మహల్(నామవరం)	: అర్జున్ s/o వైజయంతి
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: అర్జున్ s/o వైజయంతి
వెంకటసూర్య(కడియం)	: అర్జున్ s/o వైజయంతి
సత్యగౌరి (అనపర్తి)	: ఓదెల -2
సూర్యశ్రీ (అనపర్తి)	: అర్జున్ s/o వైజయంతి
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: అర్జున్ s/o వైజయంతి
గీతాసినిమాస్(సీతానగరం)	: అర్జున్ s/o వైజయంతి
శ్రీనివాస (గోకవరం)	: అర్జున్ s/o వైజయంతి
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఓదెల-2
లలితామహల్(రంపచోడవరం)	: అర్జున్ s/o వైజయంతి
నవయుగ(చింతూరు)	: అర్జున్ s/o వైజయంతి

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0 (శనివారం)
కనిష్ఠం : 26.0


డీఎస్సీ షెడ్యూల్ విడుదల

- ఉమ్మడి జిల్లాలో 1035 పోస్టులు
- మే 15 వరకూ దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామ కాలకు నోటిఫికేషన్ ఖరారైంది. అధికారికంగా ఆదివారం జారీ చేస్తారు. ఆదివారం నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, మాక్ టెస్టు మే 20 నుంచి ఉంటాయి. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)లు జూన్ ఆరు నుంచి జూలై 6వ తేదీ వరకు జరుగు తాయి. ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వా త వెలువడిన ఈ నోటిఫికేషన్‌తో నిరుద్యోగ ఉపా ధ్యాయ అభ్యర్థులు ఆనందోత్సాహాల్లో మురిసిపోయారు. పాఠశాలవిద్యాశాఖలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆయా యాజమాన్యాలు, సబ్జెక్టుల వారీగా మొత్తం 1035 పోస్టుల భర్తీకి శనివారం రాత్రి నోటిఫికేషన్ జారీచేశారు. వీటితో పాటు జువనైల్ హోం(బాలురు) పాఠశాలలో మరో ఏడు పోస్టులు, మూడు జిల్లాల పరిధిలోని వివిధ సంక్షేమ వసతి గృహాల పాఠశాలకు ఉద్దేశించిన 348 జోనల్ పోస్టు లను మెగా డీఎస్సీలో భర్తీ చేసేలా నోటిఫై చేశారు. పాఠశాల విద్యాశాఖకు సంబంధించి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రభుత్వ /జడ్పీ/మండల పరిషత్/మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో మొత్తం 1035 పోస్టులను భర్తీ చేస్తారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో ఫస్ట్ లాంగ్వేజి 42 పోస్టులు, సెకండ్ లాంగ్వేజి 61, ఇంగ్లీషు 84, గణితం 40, ఫిజికల్ సైన్సు 40, బయోలాజికల్ సైన్సు 64, సోషల్ స్టడీస్ 103, ఫిజికల్ ఎడ్యుకేషన్ 181 పోస్టులు, ఎస్జీటీ కేడర్‌లో 420 పోస్టులను నోటిఫై చేశారు.

హ్యాపీ బర్త్‌డే చంద్రబాబు

చంద్రబాబు.. ఉభయ తెలుగు రాష్ట్రాలో ఈ పేరు తెలియనివారుండరు.. ఎందుకంటే రాజకీయాల్లో మాస్టారు.. అపరచాణక్యుడిగా పేరు.. ఏపీ అభివృద్ధికి కంకణం కట్టుకున్న మెగాస్టారు.. రాజధాని అమరావతికి ఆద్యుడు.. ప్రజల మనసెరిగిన మహా నాయకుడు.. ఆయనే సీఎం చంద్రబాబు నాయుడు.. ప్రస్తుత ఏపీ రాజకీయాల్లో ఆయనకంటే సీనియర్ ఎవరూ లేరు.. ప్రజలకు ఏదో చేయాలనే తపన.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పం.. ప్రజలకు అండగా నిలబడే తత్వం.. అదే గత సార్వత్రిక ఎన్నికల్లో విజయం వైపు దూసుకెళ్లేలా చేసింది.. బాబు వస్తే.. అభివృద్ధి చేస్తారు.. పేదలకు అండగా నిలబడతారని ప్రజలు నమ్మారు.. ఓటేశారు..ఏకంగా 164 స్థానాలు ఇచ్చారు..తమ నాయకుడిని గెలిపించుకున్నారు.. నేడు 75వ పుట్టినరోజు సందర్భంగా.. హ్యాపీ బర్త్‌డే బాబు అంటున్నారు..



ఆదివారం ప్రత్యేకం

సి..నిమా హిట్టే!



హీరో బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి సినిమా చూశారా.. అందులో విలన్ కొడుకు షిప్‌లో కస్టమ్స్‌కు దొరికిపోతాడు. అప్పుడు విలన్ ఆ షిప్‌ను సముద్రంలోనే పేల్చేస్తాడు.. ఆ సీన్లలో కొన్ని కాకినాడ సీపోర్టులోనే తీశారు.

పుష్ప-2 సినిమాలో ఎర్రచందనం దుంగలను విదేశాలకు షిప్‌లో తరలించే సీన్ చూశారా.. అందులో హీరో అల్లు అర్జున్ పోర్టులో నిలబడి సవాల్ చేస్తాడు.. ఆ తర్వాత ఎర్రచందనం పట్టుకోవడానికి విలన్ ఫాజిల్ సైతం పోర్టులో అడుగుపెడతాడు.. ఆ కీలక సన్నివేశాలు ఎక్కడో తెలుసా.. ఇదిగో మన కాకినాడ సీపోర్టులోనే..

కాకినాడ పోర్టులో పుష్ప-2 సినిమాలో అల్లు అర్జున్‌పై తీసిన సీన్



దుల్కర్‌సల్మాన్ హీరోగా నటించిన లక్కీ భాస్కర్ సినిమాలో హీరో తీవ్ర ఆర్థిక సమస్యల్లో ఉంటాడు. ఈ సమయంలో క్యారెక్టర్ ఆర్టిస్ట్ రాంకీ హీరో వద్దకు వెళ్లి రూ.2 లక్షలు ఇస్తే పోర్టులో దిగుమతై ఉండిపోయిన టీవీల స్టాకును రప్పిస్తానని చెబుతాడు. అప్పుడు రాంకీ హీరో వద్ద డబ్బులు తీసుకుని పోర్టులో కస్టమ్స్‌కు డబ్బులు ఇచ్చి టీవీల స్టాకును విడిపిస్తాడు. దాంతో హీరోకు భారీగా లాభం వస్తుంది. ఈ ముఖ్యమైన సీన్లన్నీ ఎక్కడో కాదు.. కాకినాడ సీ పోర్టులోనే షూటింగ్ చేశారు.

బ్లాక్‌బస్టర్ మూవీ అలవైకుంఠపురంలో హీరో అల్లు అర్జున్ విలన్ సముద్రఖనితో గొడవ పడే సీన్లు చూశారా.. అక్కడ విలన్ కొడుకుతో సాగించే ఆసక్తికరమైన స్టైలిష్ ఫైట్లు అందరినీ అలరిస్తాయి. ఇది కాకినాడ సీపోర్టులోనే షూటింగ్ చేశారు..

సినిమాల విజయతీరం కాకినాడ!

22 సినిమాల షూటింగ్

అనేక బ్లాక్‌బస్టర్ తెలుగు సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా కాకినాడ సీపోర్టు మారింది.. చాలా సినిమాల్లో అత్యంత కీలక సన్నివేశాలు, క్లైమాక్స్ ఫైట్లు, షిప్‌ల్లో కార్గో ఎగుమతికి సంబంధించిన సీన్లు సీపోర్టులోనే చేస్తున్నారు. పోర్టులో షూటింగ్ చేయడానికి హీరోలు, డైరెక్టర్లు, నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే సినిమాలో ఏదొక చిన్న పార్ట్ అయినా పోర్ట్‌లో షూట్ చేస్తే బొమ్మ హిట్ అనే సెంటిమెంట్ బలపడిపోయింది. అందుకే అనేక సినిమాలు పోర్టులో షూటింగ్ చేసుకుని హిట్ కొడుతున్నాయి. - (కాకినాడ,ఆంధ్రజ్యోతి)



తెలుగు సినిమా మారింది.. బడ్జెట్ పెరిగింది.. చిత్రీకరణలోనూ తేడా వచ్చింది.. ఎక్కడో విదేశాలకు కాకుండా లోకల్ స్పాట్లకు డిమాండ్ పెరిగింది. గతంలో సినిమా తీశారంటే విదేశాలకు వెళ్లాల్సిందే. ప్రస్తుతం గోదావరి జిల్లాల వెంట పరుగెడుతున్నారు. సముద్రం.. పోర్టు.. కావాలంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ పోర్టులో సినిమా హీరోలు.. డైరెక్టర్లు వాలిపోతున్నారు. వంద కోట్ల బడ్జెట్ నుంచి రూ.10 కోట్ల బడ్జెట్ సినిమాల వరకు కాకినాడ సీపోర్టులో షూటింగ్ చేసుకోవడానికి పోటీపడుతుంటారు. తరచూ సినిమా షూటింగ్ లతో సందడి మారి సినిమా పోర్టుగా పేరు తెచ్చుకుంది. పోర్టులో అనేక ప్రాంతాలు కీలక సన్నివేశాల చిత్రీకరణకు అనువుగా ఉండడంతో చాలామంది డైరెక్టర్లు సినిమా షూటింగ్‌లకు ఎంచుకుంటున్నారు. సీపోర్టుకు తరచూ వివిధ దేశాల నుంచి భారీ నౌకలు ఏకంగా బెర్త్ వద్దకే వస్తాయి. కార్గో లోడింగ్‌కు వారం నుంచి పది రోజుల వరకు ఇక్కడే ఉంటాయి. కస్టమ్స్ అధికారులు, భారీ క్రేన్లు, టిప్పర్లు, విశాలమైన బెర్త్‌లు, వెనుక సముద్రం.. ఇవన్నీ సినిమా షూటింగ్‌కు అనువుగా, అందంగా ఉంటున్నాయి. దీంతో అనేక చిత్రాలు ఇక్కడకు క్యూ కడుతున్నాయి.

షూటింగ్‌కు రోజుకు రూ.లక్ష

పోర్టు..షిప్‌లు.. సముద్రం బ్యాక్‌డ్రాప్‌లో సినిమా షూటింగ్ చేయాలంటే చాలా కష్టం. పోర్టుల్లో అనుమతులివ్వరు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పోర్టులో షూటింగ్ చేయాలంటే వైజాగ్ పోర్టు కేంద్రం ఆధీనంలో ఉంటుంది. అనుమతులు కష్టం. పక్కనే గంగవరం పోర్టు ఉన్నా నేవీ స్థావరాల నేపథ్యంలో అనుమతులు రావు. ఆ తర్వాత కాకినాడ పోర్టు ఉంది. అయితే ఇక్కడ అనుమతులను పోర్టు యాజమాన్యం సులువుగా ఇస్తోంది.సినిమా షూటింగ్‌లకు విశాలంగా ఉండడంతో ఎక్కువ మంది డైరెక్టర్లు ఇటే మొగ్గు చూపుతున్నారు. వాస్తవానికి ఎయిర్‌పోర్టు లేదా మెట్రో స్టేషన్లు, రైళ్లలో షూటింగ్ చేయా లంటే రోజుకు రూ.16 లక్షల వరకు ఛార్జ్ చేస్తారు. కాకినాడ సీపోర్టులో రోజుకు షూటింగ్‌కు రూ.లక్ష వసూలు చేస్తారు. తక్కువ ఛార్జీలు ఉండడం కూడా పోర్టులో సినిమా షూటింగ్‌లకు కలిసివస్తోంది. వాస్తవానికి పోర్టు కట్టిన స మయంలో సినిమా షూటింగ్‌లకు ఛార్జి రోజు కు రూ.10 వేలు.అప్పుడే ఆర్.నారాయణ మూర్తి హీరోగా ఎర్రసముద్రం సినిమా షూటింగ్ చేశారు. సినిమా షూటింగ్‌లకు సరిపడా వాతావరణం పోర్టులో ఉండడంతో ఇక్కడకు క్యూ కడుతున్నారు. ఇక్కడ చిత్రీకరణ చేసుకున్న సినిమాల్లో 80 శాతం వరకు హిట్ అవుతున్నాయి. సినిమాకు సంబంధించి హీరో పోర్టులో షూటింగ్‌లో పాల్గొనే సన్నివేశాలుంటే ఆ సినిమా హిట్ పక్కా అని పోర్టు అధికారులు చెబుతుండడం విశేషం.

అల్లు అర్జున్‌కు ఎంత సెంటిమెంటో..

పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్‌కు కాకినాడ సీపోర్టు సెంటిమెంట్‌గా మారింది. ఆయన సినిమా ఏదైనా సీపోర్టులో షూటింగ్ జరగాల్సిందే. తొలుత అలవైకుంఠపురం సినిమాలో కీలక ఘట్టాలన్నీ ఇక్కడే చిత్రీకరించారు. ఆ తర్వాత 'పుష్ప' సినిమా షూట్ చేశారు. ఈ సినిమా సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. పుష్ప-2 కూడా ఇక్కడే వారాల తరబడి షూటింగ్ చేశారు.

కాకినాడ సీపోర్టులో ఇప్పటివరకు 22 సినిమాల షూటింగ్‌లు జరిగాయి. 2000లో విజయకాంత్ హీరోగా మాస్, 2008లో ఆర్.నారాయణమూర్తి హీరోగా ఎర్రసముద్రం, 2018లో హీరో రామ్ నటించిన హలోగురు ప్రేమ కోసమే.. విజయ దేవరకొండ హీరోగా గీత గోవిందం.. అడవి శేషు హీరోగా గూఢచారి, 2019లో శర్వానంద్ హీరోగా రణరంగం, 2019లో విజయ్ దేవరకొండ నటించిన డియర్ కామ్రేడ్, అల్లు అర్జున్ హీరోగా అల వైకుంఠపురం, 2021లో అల్లు అర్జున్ హీరోగా పుష్ప 2, హీరో శ్రీరాం నటించిన దాడి, చిరంజీవి, రాంచరణ్ నటించిన ఆచార్య, రవితేజ హీరోగా ఖిలాడీ, 2022లో నవీన్‌చంద్ర నటించిన రుద్ర, 2023లో బాలకృష్ణ భగవంత్ కేసరి, వెంకటేష్ నటించిన సైంధవ్, హీరో గోపిచంద్ నటించిన భీమ, రవితేజ హీరోగా టైగర్ నాగేశ్వరరావు, పవన్ కల్యాణ్ హీరోగా ఓజీ, 2024లో దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్, అల్లు అర్జున్ పుష్ప-2, హీరో సిద్దు డీజే టిల్లు స్క్వేర్, ఉపేంద్ర హీరోగా ఆర్‌సీ-45 తదితర చిత్రాలు ఇక్కడే షూటింగ్‌లు చేసుకున్నాయి. పోర్టులో షూటింగ్ చేస్తే ఆ సినిమా హిట్ అనే ప్రచారం బలంగా ఉంది.



ఓటర్ల సంఖ్యను హేతుబద్ధీకరిస్తాం
డీఆర్వో సీతారామమూర్తి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య హేతుబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నామని డీఆర్వో టి.సీతా రామమూర్తి తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీలు తమ వంతుగా సహకారం అందించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 1581 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 1168 కేంద్రాల్లో 1200 మంది కంటే తక్కువ ఓటర్లు ఉండగా 413 కేంద్రాల్లో 1200కి పైబడి ఉన్నారన్నారు. హేతుబద్ధీకరణ ప్రక్రియ ద్వారా సమం చేస్తామన్నారు. జిల్లాలో పురుషులు 7,91,179, మహిళలు 8,29,229 కలిపి మొత్తం 16,21,164 మంది ఓటర్లు ఉన్నారన్నారు . సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు టీడీపీ ఎం.శివ సత్య ప్రసాద్,ఆప్ కె.సంతోష్ కుమార్,వైసీపీ టి.దేవదానం, సీపీఐ ఎంపీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు ఫ్లయ్ ఓవర్ వేగవంతం చేయాలి
కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో శనివారం ఇరిగేషన్, రెవెన్యూ ,వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ప్రాజెక్టు వల్ల జిల్లాకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. సాంకేతిక పరమైన అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆర్‌డీవో, రైల్వే ఈఈ, ఎస్ఈ ఇరిగేషన్, జిల్లా వ్యవసాయాధికారులు పరస్పరం సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.ఎర్రకాలువ వరదలు వచ్చినప్పుడు ముంపు ఇబ్బందులు లేకుండా పరిష్కారం కోసం జిల్లా మంత్రితో చర్చించి నివేదిక ఇస్తామని చెప్పారు.సమావేశంలో ఆర్‌డీవో రాణి సుస్మిత, ఎస్ఈ కే.గోపినాథ్, ఈఈ ఎం.సుబ్రహ్మణ్యం, డీఏవో ఎస్.మాధవరావు, ఎర్రకాలువ డీఈ కే.రమేష్ పాల్గొన్నారు.



10
కార్మికులకు దన్ను ఈ శ్రమ్ కార్డులు

ఈ-పోస్ యంత్రాలతో మార్కెట్ చెస్ వసూళ్లు
వచ్చే వారం నుంచి జిల్లాలో అమలు

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్కెట్ కమిటీల చెక్ పోస్టుల వద్ద ఈ పోస్ పరికరం ద్వారా డిజిటల్ విధానంలో రైతుల నుంచి చెస్ వసూళ్లు చేస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం ఎస్‌బీఐ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లతో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 చెక్‌పోస్టులలో ఈ పరికరాలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఇక ఎక్కడా చెస్‌ను నగదు రూపంలో వసూలు చేయకూడదని తెలిపారు. ఇది పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో అమలు చేస్తున్నామన్నారు. తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వస్తుందన్నారు.ఆర్థికపరమైన లావాదేవీల్లో అక్రమాలకు తావులేకుండా ఈ ప్రతిపాదన చేసినట్టు తెలిపారు. డిజిటల్ నగదు చెల్లింపు వల్ల ప్రభుత్వ ఖాతాలకు నేరుగా జమవుతుందని దీని వల్లన అక్రమాలకు తావుండదన్నారు. సరుకు దానికనుగుణంగా చెస్ విధిస్తారన్నారు.జిల్లాలో అనపర్తి ఏఎంసీ పరిధిలో బిక్కవోలు చెక్‌పోస్టు, రాజమండ్రి పరిధిలో కాతేరు కొవ్వూరు పరిధిలో కొవ్వూరు,సీతంపేట, గోపాలపురం పరిధిలో యర్నగూడెం ,గోపాలపురం, నల్లజర్ల, నిడదవోలు పరిధిలో పెరవలి , నిడదవోలు, రాజానగరం పరిధిలో రాజానగరం,సీతానగరం, కోరుకొండ చెక్‌పోస్టుల్లో పరికరాలు సిద్ధం చేయాలన్నారు. వచ్చేవారం నుంచి డిజిటల్ సేవలు అమల్లోకి వస్తాయన్నారు.సమావేశంలో మార్కెట్ కమిటీ ఏడీ ఎం.సునీల్‌వినయ్,ఎల్‌డీఎం పీవీ.ప్రసాద్, ఎస్‌బీఐ జోనల్ సేల్స్‌మేనేజర్‌రాజేష్ పాల్గొన్నారు.

ఈ వేస్ట్ ఇంట్లో ఉంటే..కేన్సర్ ముప్పు
మంత్రి కందుల దుర్గేష్



సుబ్రహ్మణ్య మైదానంలో ఈ వ్యర్థాలను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఈ వేస్ట్‌పై అవగాహన లేక ప్రజలు వాటిని ఇంట్లో నిల్వచేస్తున్నారని.. దీని వల్ల అనారోగ్యం పాలవుతారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్యం మైదానం, బొమ్మూరు వైటీసీ ప్రాంగణంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాలకు హాజరై మాట్లాడారు. ఈ వేస్ట్ అంటే ఎలక్ట్రికల్ వ్యర్థాలని.. టీవీ, కంప్యూటర్, మొబైల్ ఫోన్లు, వైర్లు, ఎలక్ట్రికల్ పరికరాలు పాడైపోయిన తరు వాత నిల్వ చేయకూడదని చెప్పారు.వాటిని రీసైక్లింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన కేంద్రంలో అప్పగించాలన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల నుంచి వెదజల్లే రేడియేషన్ వల్ల కేన్సర్, ఇతర అనారోగ్యాలకు గురి కావడం చూస్తున్నామన్నారు.కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ప్రతివారం మూడో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు.ఈ వారం ఈ వేస్ట్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ వేస్ట్‌లో ఉత్పన్నమయ్యే రసాయనాల వల్ల క్యాన్సర్ వస్తుందని.. అటువంటివి ఇంట్లో ఉంటే వెంటనే వాటిని సేకరణ కేంద్రాలకు అప్పగించాలన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సరైన విధానంలో డిస్పోజ్ చేయాలన్నారు. రాజమహేంద్రవరం, రూరల్, రాజానగరం ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఈ వేస్ట్ విషయంలో మహిళలు అవగాహన కలిగి ఉం డాలన్నారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ ఈవేస్ట్‌ను సేకరించే కేం ద్రాలు రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేస్తున్నామని..ప్రజల నుంచి పరికరాల వారీగా కొనుగోలు చేసి వాటిని శ్రీకాకుళం వద్ద ఉన్న రీసైక్లింగ్ ప్లాంట్‌కు తరలిస్తామన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించి సేకరించిన ఎలక్ట్రికల్ వేస్ట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, ఇన్‌చార్జి డీపీవో శాంతామణి, డ్వామా పీడీ ఏ నాగమహేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, డీఎల్‌డీవో వీణాదేవి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మజ్జి రాం బాబు, నగరపాలక సంస్థ సెక్రటరీ శైలజవల్లి, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, మండల ప్రత్యేకాధికారి ఎన్ .జ్యోతి,రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావు , ఈఈ మదర్షా ఆలీ,శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్, ఆర్‌వో సీహెచ్.శ్రీనివాసరావు, మేనేజరు మాలిక్ పాల్గొన్నారు.





మంచినీటికి పడిగాపులు

అందని సత్యసాయి తాగునీరు

- 15 మండలాల్లో కట్ కట
- వారం రోజులుగా ప్రజల ఇక్కట్లు

కోరుకొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు.. వారం వారం సమస్య వస్తూనే ఉంది. అయినా పట్టించుకునేవారే కానరావడంలేదు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబు సుమారు రూ.500 కోట్లు ఖర్చు పెట్టి 15 మండలాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి బృహత్తర పథకం చేపట్టారు. కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాలతో సహా ఏజెన్సీ ప్రాంతంలో కొన్ని మండలాలకు, గోదావరి జలాలను శుద్ధి చేసి పైపులైన్ల ద్వారా మంచినీరందే ఏర్పాట్లు చేశారు.ఈ మేరకు గ్రామాల్లో ప్రత్యేకంగా ట్యాంకులు నిర్మించారు. అయితే గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు సక్రమంగా మంచినీరందడం లేదు. నెలలో నాలుగైదు రోజులు మాత్రమే మంచినీరందించి చేతులు దులుపుకుంటున్నారు.ఈ ఏడాది సమస్య మరింత జటిలమైంది. కోరుకొండ మండలంలో 22 గ్రామాలు సత్యసాయి మంచినీటిపై ఆధారపడి ఉన్నాయి. ఈ ఏడాది సంక్రాంతి పండుగ, లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో కూడా ప్రజలకు మంచినీరందలేదు.ప్రతి నెలలోను ఇదే పరిస్థితి పునరావృతమవుతుంది. సత్యసాయి మంచినీటి సరఫరాలో పని చేసే కాంట్రాక్ట్ సిబ్బందికి ప్రభుత్వం సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని, అందుకే తరుచుగా సిబ్బంది మంచినీటిని సక్రమంగా అందించకుండా ప్రజలను ఇబ్బంది చేస్తున్నట్టు చెబుతున్నారు. సుమారు 21నెలల జీతం చెల్లించాలని వారంటున్నారు. ఇటీవల సిబ్బంది సమ్మెకు దిగిన సందర్భంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో సిబ్బంది తాత్కాలికంగా రెండు నెలల వేతనం అందించే ఏర్పాటు చేశారు. అప్పట్లో 10 రోజులు మంచినీరందించారు. మళ్లీ షరా మామూలే. గత వారం రోజులుగా సత్యసాయి మంచినీటి ట్యాంకుల ద్వారా ప్రజలకు గోదావరి మంచినీరు అందడం లేదు. అసలే వేసవి కాలం కావడంతో తాగునీటి వినియోగం బాగా పెరిగింది. పరిశుభ్రమైన మంచినీరందించకపోతే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


VISIONARIES THINKS ABOUT NEXT GENERATION
1950
2025
GLOBAL LEADER
దేశం గర్వించదగ్గ ఉత్తమ నాయకత్వం, పాలనలో
సమకాలీన దేశ నాయకులందరికీ ఆదర్శం, క్రమశిక్షణ,
కఠోర శ్రమ, ముందుచూపు, మార్గనిర్దేశనం... అన్నిటినీ
మించి మానవత్వానికి, నిజాయితీకి నిలువెత్తు రూపం,
గ్రేట్ విజనరీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
జన్మదిన శుభాకాంక్షలు
కందుల దుర్గేష్
రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక
సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు


నిత్య కృషీవలుడు, అలుపెరగని పోరాటయోధుడు, ప్రజల మనిషి,
అభివృద్ధి ప్రదాత, సంక్షోభాన్ని సంక్షేమంగా మార్చేమేధావి, సంపద సృష్టికర్త,
తెలుగుప్రజల నమ్మకం, జనం మెచ్చిన నాయకుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
యస్.రాజీవ్ కృష్ణ

నవధాన్యాల సాగుపై అవగాహన



రైతులకు పీఎండీఎస్ నవధాన్యాల కిట్లు అందిస్తున్న అధికారులు

కొవ్వూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దొమ్మే రులో పీఎండీఎస్ నవధాన్యాల సాగుపై శనివారం అవగాహన కల్పించారు. ఇందులో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజరు తాతారావు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పచ్చిరొట్ట పంటగా నవధాన్యాలు వేయాలని తెలిపారు. అనంతరం ఏడీఏ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఆర్ ఎస్‌కేకు పీఎండీఎస్ కిట్లు అందజేస్తామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవ రావు మాట్లాడుతూ ప్రతి రైతూ పీఎండీఎస్ నవధాన్యాలు పచ్చిరొట్ట పంటగా వేసి భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం పీఎండీఎస్ విత్తనాల కిట్లను రైతులకు అందించారు. సర్పంచ్ తానేటి కుమారి, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగించాలి

దేవరపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): భూసారాన్ని పెంపొందించడానికి పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగించాలని ప్రకృతి వ్యవసాయ శాఖ డివిజన్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ అన్నారు. యర్నగూడెంలో ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నవధాన్యాలు చల్లుకుని 30 రోజుల తరువాత కలియదున్నాలని, దీని ద్వారా భూసారం పెంపొందటంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం రైతు గద్దే మునేశ్వరరావు మాట్లాడుతూ పంట సాగు చేసే ముందు ఈ పచ్చిరొట్ట ఎరువులను వాడటం వల్ల భూ మి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. దీనిలో భాగంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు గద్దే మునేశ్వరరావు, మర్రి వెం కటేశ్ బేతాళ అచ్చియ్య, గంగవరపు శ్రీనివాస రావును ప్రకృతి వ్యవసాయశాఖాధి కారులు సత్కరించారు. ప్రకృతి వ్యవసాయశాఖ అధి కారులు, సిబ్బంది సతీశ్, విజయలక్ష్మి, కృష్ణ, గీతాదేవి, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

దీక్ష విరమణకు బీచ్‌కు వెళ్లి.. సముద్రపు నీటికి ఉక్కిరిబిక్కిరై..

● ఒడ్డుకు వచ్చి చికిత్స పొందుతూ యవకుడి మృతి
● ప్రాణాలతో బయటపడిన మరో ఇద్దరు



మృతిచెందిన ఉదయ్‌కుమార్

మొగల్తూరు / నల్లజర్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా పేరుపాలెం బీచ్‌కు దీక్ష విరమణకు వెళ్లిన ఓ యవకుడు మృతిచెందాడు. వివరాల ప్రకారం.. ఏటా ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లోని పలుప్రాంతాల నుంచి వేలాదిగా క్రైస్తవ విశ్వాసులు 40 రోజుల పాటు దీక్ష చేసి గుడ్‌ఫ్రైడే రాత్రి సమయంలో పేరుపాలెం తీరంలోని వేళాం కిణ్ణి మాత ఆలయం వద్ద దీక్ష విరమణ చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది శుక్రవారం రాత్రి వచ్చిన సందర్శకుల్లో శనివారం వేకువజామున సముద్ర స్నానానికి దిగిన ఇద్దరు యువకులు ఎక్కువ సముద్రం నీరు తాగడంతో ఉక్కిరి బిక్కిరికి లోనై ఒడ్డుకు ప్రాణాలతో కొట్టుకు వచ్చారు. వారిలో ఒక యువకుడు తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన సంకెళ్ల ఉదయ్ కుమార్(19). అతడిని స్థానికులు, పోలీస్ సిబ్బంది మొగల్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అపస్మారకస్థితిలో ఉండడాన్ని గుర్తించి నర సాపురం ఏరియా ఆసుపత్రికి తర లించి వైద్యం చేస్తుండగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇదే సంఘటనలో ఉన్న తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి సికిం ద్రర్‌ను నరసాపురం ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొంది సాయంత్రం ప్రకాశరావు పాలెం వచ్చాడు. అలాగే తూర్పు గోదావరి జిల్లా ఆవపాడు చెందిన యువ కుడు కోడే పవన్ కుమార్ కూడా నీటిలో మునగడంతో నరసాపురం ఆసుపత్రికి, మెరుగైన వైద్యనిమిత్తం భీమ వరం ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం నిల కడగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ఉదయ్‌కుమార్ తండ్రి చిన్నతనంలోనే మృతిచెందగా తల్లి విజయలక్ష్మి ఆలనా పాలన చూస్తోంది. మృతుడి అక్క విజయలక్ష్మి ఫిర్యాదుతో మొగల్తూరు 2వ ఎస్ఐ వై.నాగలక్ష్మి కేసు నమోదు చేశారు.

నేడూ ఆస్తి పన్నుల చెల్లింపునకు అవకాశం: కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగర పరిధిలో ఆస్తి పన్నులు చెల్లించాల్సిన వారు ఆదివారం కూడా చెల్లింపులు చేయవచ్చని, సెలవు రోజుకూడా కౌంటర్లు తెరిచే వుంటాయని మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఇ వేస్టును నిల్వ చేయడం ప్రమాదకరం

● స్వచ్ఛ ఆంధ్రా.. స్వచ్ఛ దివస్‌లో

మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి



కమిషనర్‌కు ఇ వేస్టును అందిస్తున్న తహశీల్దార్ దుర్గాప్రసాద్

కొవ్వూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వినియోగంలో లేని ఈ వేస్టును నిల్వ చేయడం ప్రమాదకరమని మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి తెలిపారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, మున్సిపల్ హైస్కూల్ వద్ద స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నందు ఆర్‌ఆర్‌ఆర్‌ఈ వేస్టు కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభించారు. తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, హౌసింగ్ ఏఈ చక్రవర్తి, ఆంధ్రా షుగర్స్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సీహెచ్‌ఎస్ మహర్షి తమ కార్యాలయాలలో వినియోగంలో లేని ఈ వేస్టును మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ నాగేంద్ర కుమార్, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, హౌసింగ్ ఏఈ చక్రవర్తి, హైస్కూల్ హెచ్ఎం గంగా భవాని, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

డివిజనల్ కోఆపరేటివ్ కార్యాలయంలో..

ఎలక్ట్రానిక్ వ్యర్థాల పునర్ వినియోగంపై దృష్టిపెట్టాలని కొవ్వూరు డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి వీ. కృష్ణకాంత్ అన్నారు. స్వచ్ఛఆంధ్రా స్వచ్ఛ దివస్‌లో భాగంగా పట్టణంలోని సత్యవతి నగర్ వద్ద ఉన్న డివిజనల్ కోఆపరేటివ్ కార్యాలయం వద్ద ఎలక్ట్రానిక్ పునర్వినియోగంపై జరిగిన సమావేశంలో కృష్ణకాంత్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ చేపట్టి పునర్వినియోగంపై ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాది వీఆర్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ వ్యర్థాలు పునర్వినియోగం చేసుకోకపోతే భూమి అంతా ఈ వ్యర్థాలమయంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వై.చలపతిరావు, కోఆపరేటివ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ మినీబైపాస్ వద్ద...

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలందరూ బాధ్యత కలిగి ఉండాలని అవంతి ఫౌండేషన్ అధినేత అల్లూరి ఇంద్రకుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని రైల్వేస్టేషన్ మినీబైపాస్ నందు స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా అవంతి ఫౌండేషన్, మున్సిపాలిటీ సంయుక్తంగా కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా ఇంద్రకుమార్ మాట్లాడుతూ ప్రాచీన చరిత్ర కలిగిన కొవ్వూరు పట్టణం నేడు చెత్తకు కేంద్రంగా మారడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, పొట్లు మురళి, అవంతి సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవ రణలో శనివారం స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఈ వేస్ట్ థీమ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అప్పన జగదీష్ మాట్లాడుతూ ఈ వేస్టును బహిరంగంగా భూమిపై పడవేయం వల్ల విష వాయువులు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యం బారినపడతారని తెలిపారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మంలో కార్యదర్శులు వీరన్న, కె. శ్రీను, కె.రవి ప్రకాష్, హెచ్ఎం సుబ్బలక్ష్మి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. అలాగే పెద్దేవంలో పంచాయతీ కార్యదర్శి బీ. సాంబమూర్తి అధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప సర్పంచ్ తోట రామకృష్ణ మాట్లా డుతూ తడి, పొడి చెత్త విడివిడిగా పంచాయతీ సిబ్బందికి అందించాలని తెలిపారు. వేగేశ్వరపు రంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి, కార్యదర్శి నాగాంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మలకపల్లిలో గ్రామ సర్పంచ్ రాపాక రాజేశ్వరి ఆధ్వర్యంలో ఈ వేస్టుపై అవగాహన కల్పించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్జహాన్ ఆధ్వర్యంలో కార్యదర్శి కామేశ్వరి సమక్షంలో సచివాలయ సిబ్బంది, హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిరహించారు. కార్యక్రమంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చాగల్లు: స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్థానిక సంపద తయారీ కేంద్రం వద్ద శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం థీమ్ ఈ వేస్ట్ సేకరణ, డిస్ పోజ్ చేయుటలో భాగంగా వ్యర్థాలను సేకరించారు. పంచాయతీ సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, కార్యదర్శి మొహ్మద్‌ఆలీ, ఈవోఆర్‌డీ శ్రవణ్ కుమార్, ఏపీఎం శ్రీనివాసరావు, డ్వాక్రా సంఘాల సభ్యులు, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: రాష్ట్రం స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా చేసేందుకు ప్రజా సహకారం అవసరమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా కాల్దరిలో జరిగిన స్వర్ణఆంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్రసాధ్యమని చెప్పారు. 2047 నాటికి దేశం వికసిత్‌భారత్‌గాను, రాష్ట్రం స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా రూపాంతరం చెందాలని ఆయన పిలుపునిచ్చారు. తొలుత స్వర్ణఆంధ్ర-స్వచ్ఛఆంధ్రపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు కోమటపల్లి వెంకటసుబ్బారావు, సర్పంచ్ చీపుళ్ల కుమారి, ఉపసర్పంచ్ ఈర్పిన సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు చెట్టే నవీన్, తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో వీఎస్ రామారావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో మాట్లాడుతున్న ఉప సర్పంచ్ జగదీష్



చాగల్లులో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



కాల్దరిలో ఈ-వేస్ట్ సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్


చీపురుగూడెంలో అన్నసమారాధన



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

నల్లజర్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెం సీతారామమందిరం వద్ద శనివారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. ఇటీవల శ్రీరామ నవమి వేడుకలను ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తిమ్మన్న పాలెం, చీపురుగూడెం, కృష్ణమ్మగూడెం గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి మంది భక్తులు వచ్చారు.

ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకోవాలి



పేషెంట్లకు టబ్‌లు అందజేస్తున్న సర్పంచ్ మధు

పెరవలి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం అందజేస్తున్న మందులు, సదుపాయాలను వినియోగించుకోవాలని కానూరు సర్పంచ్ బావన మధు పూర్ణ చందు పేర్కొన్నారు. కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల ఫైలేరియా పెషెంట్లు 15 మందికి జిల్లా డీఎంహెచ్‌వో నుంచి వచ్చిన వివిధ రకాల ఫొటోలను పంపిణీ చేశారు. వీటిలో టబ్, మగ్గు, రెండు అయింట్‌మెంట్లు, సబ్బు ఉన్నాయి. వీటిని ఫైలేరియా రోగులకు అందజేరు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు వెంకాయమ్మ, ప్రశాంతి ఆశావర్కర్లు, పార్వతి, ద్వారకా పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకే పాలన అందిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రజాభీష్టం మేరకే పాలన అందిద్దామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయపు సమావేశ మందిరంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నమ్మకంతో ఓటువేసి గెలిపించిన ప్రజలకు గ్రామీణ ప్రాంతాల్లో ఎదురవుతున్న సమస్యలను దశల వారీగా చేసేందుకు పాలకులు, అధికారులు, మధ్య సమన్వయం అవసరమన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాకులపాటి లలిత, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో బీఎస్ఎస్.శ్రీనివాస్, ఆయాశాఖాధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌లో విద్యార్థులతో కలిపి ర్యాలీ నిర్వహించారు.

అగ్నిమాపక వారోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కొవ్వూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆరోరోజు కొవ్వూరు అగ్నిమాపక కేంద్రం పరిధిలో గల హాస్ప టల్స్ నందు అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా శ్రీశివసాయి హాస్పటల్ నందు అగ్నిప్రమాదాల నివారణా చర్యలు, జాగ్రత్తల గురించి హాస్పటల్ ఆవరణలో డాక్టర్లు, సిబ్బంది, రోగులు, ప్రజలకు మాక్ డ్రిల్ చేసి చూపించారు. కార్యక్రమంలో ఎన్‌వీ రామకృష్ణ, సీహెచ్‌వీవీ గంగాధర్, కే.విజయ రత్నం, ఎం. ప్రకాష్‌బాబు, జీ.సీహెచ్ సుబ్బారావు, హాస్పటల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నిడదవోలు: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణమే స్పందించి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పెనుప్రమాదలు సంభవించకుండా నివారించవచ్చునని సహాయ జిల్లా అగ్నిమాపక శాఖాధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. శనివారం నిడదవోలు పట్టణంలోని వివిధ ఆసుపత్రుల వద్ద అగ్నిమాపక వారోత్స వాల్లో భాగంగా ఆరో రోజు అవగాహన కల్పించారు. హాస్పటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో అధికారుల తనిఖీలు

నల్లజర్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘంటావారిగూడెం లాము పెట్రోల్ బంకులో అవక తవకలు జరుగు తున్నాయని వినియో గదారుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు సివిల్ సప్లై, లీగల్ మెట్రాలజీ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. రూ. 100 పెట్రోల్ కొనుగోలు చేస్తే రూ. 99 పెట్రోల్ మాత్రమే వస్తున్నట్టు గుర్తించారు. రూ. 200 కొట్టించినప్పుడు రూ. 201 పెట్రోల్ వస్తుందని గుర్తించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం హెచ్చు, తగ్గుల్లో స్వల్ప మార్పులు ఉన్నాయని, వాటిని సరిచేయాలని యాజమాన్యాన్ని హెచ్చరించారు. బంకులో టెక్నికల్ కారణం వల్ల రూపాయి, అర్థ రూపాయి తేడా సర్వ సాధారణమని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ అధికారి (ఏలూరు) బీ. సాయిరాం తెలిపారు. తనిఖీల్లో సివిల్ సప్లై ఏఎస్‌వో నాగాంజనేయులు, సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉరి పోసుకుని ... ఎంసీఏ విద్యార్థి మృతి



మృతుడు లంక నాగ శ్రీసత్య సాయికుమార్

కొవ్వూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఉరి పోసుకుని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం అందించిన వివరాల ప్రకారం .... మండలంలోని దొమ్మేరుకి చెందిన లంక నాగ శ్రీసత్య సాయికుమార్ (22) సూరంపాలెంలోని ఓ కళాశాలలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సాయికుమార్ తల్లికి ఇటీవల కంటికి శస్త్రచికిత్స చేయించడంతో తల్లితండ్రులు గత కొద్ది రోజులుగా కొవ్వూరు పట్టణంలోని తన కుమార్తె ఇంటి వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం సాయికుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి స్నేహితుడు శ్యాంసన్ ఇంటికి వచ్చి సాయికుమార్‌ని పిలవగా, ఎంతకీ పలకకపోవడంతో కిటికీలోంచి చూసేసరికి విగతజీవిగా కనిపించాడు. దీంతో శ్యాంసన్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడి తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

కార్మికులకు దన్ను 'ఈ-శ్రమ్'

●ప్రమాదంలో మరణిస్తే రూ. రెండు లక్షల ఆర్థిక సాయం

● ఉచితం.. ఆటో రెన్యూవల్
● స్వీయ నమోదుకు అవకాశం
● ప్లాట్‌ఫాం వర్కర్లకు ప్రత్యేక నమోదు
● సంక్షేమ, సామాజిక భద్రత కోసం కేంద్ర ప్రభుత్వ పథకాలు



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రెక్కాడినా డొక్కాడుతుందని నమ్మకం లేని బతుకులు. ఆ రోజు చేతికి పని దొరికితే నాలుగు మెతుకులు కడుపులోకి వెళ్లినట్లే. పని చేసినంతకాలం అప్పుల జీవితం. కళ్లు మూశాక కుటుంబాలకు కరువయ్యే ఊతం. ఆసరా కోసం ఆశగా చాపే చేతులు.. వారే అసంఘటిత రంగ కార్మికులు. కష్టాలతో సహవాసం.. కన్నీళ్ల జీవితం. ప్రభుత్వాలు విపత్తుల వేళ ఆదుకోవాలన్నా ఇంత కాలం ఆయా కార్మికుల గురించి ఎలాంటి సమాచారం లభ్యత లేదు. అసలు వాళ్లను ప్రత్యేకంగా పట్టించుకున్న వారే లేరు. అయితే.. వారికి భవిష్యత్తులో దన్ను కాబోతోంది 'ఈ-శ్రమ్' కార్డు. కరోనా విపత్తు వేళ అసంఘటిత రంగ కార్మికులను ఆదుకుందామన్నా ప్రభుత్వాలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వాటిని అధిగ మించడానికి, సామాజిక భద్రత కల్పించి, సంక్షేమ పథకాల్లో మరింతగా భాగస్వాములను చేయడం ద్వారా వారి బతుకుల్లో వెలుగులు నింపడానికి కేంద్ర ప్రభుత్వం కేంద్రీకృత డేటా బేస్‌ని రూపొందిస్తోంది. తర్వాత పలు విధాలుగా లబ్ధి చేకూర్చే అవకాశం ఉంది. అందువల్ల 'ఈ-శ్రమ్' కార్డు.. భవిష్యత్తులో కార్మికులకు దన్ను కాబోతున్నాయనడంలో సందేహం లేదు. ఈ కార్డు పొందడానికి ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. పైగా ఆటో రెన్యూవల్ సదుపాయం వల్ల రెన్యూవల్ చేసుకోవాల్సిన అవసరం ఉండదు.

ఎవరు అర్హులు?

16-59 ఏళ్ల మధ్య వయసు కలిగిన భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు, వ్యవసాయ కూలీలు, ఇటుక, సున్నపు బట్టీ కార్మికులు, మత్స్యకారులు, కుమ్మరి, స్వర్ణకారులు, మంగళి, చర్మకారులు, రజకులు, ఉపాధి కూలీలు, ఆశా వర్కర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథక వర్కర్లు, ఇళ్లల్లో పని చేసేవారు, వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, కల్లుగీత కార్మికులు, రిక్షా కార్మికులు, కళాకారులు, బీడీ కార్మికులు, చెత్త సేకరించే వారు, దుకాణాలు, సంస్థల్లో పని చేసే కార్మికులు, వలస కార్మికులు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని వారు ఇందుకు అర్హులు.

ఎక్కడ.. ఏమి కావాలి?

ఈ-శ్రమ్ కార్డు కోసం సరమళమైన మోదు ప్రక్రియ ఉంటుంది. కాబట్టి సొంతగా చేసు కోవచ్చు. లేదా అన్ని గ్రామ/వార్డు సచివాలయాలు, సీఎస్‌సీ సెంటర్లు, కార్మిక శాఖ కార్యాల యాల్లోనూ నమోదు చేసుకో వచ్చు. నమోదు కోసం ఆధార్ కార్డు, బ్యాంకు ఎకౌంటు జిరాక్సు, సెల్‌ఫోన్ నెంబరు, నామినీ పేరు, పుట్టిన తేదీ వివరాలు ఉంటే సరిపోతుంది.

సాధారణ కార్మికులకు ప్రయోజనం..

ప్రయోజనాలు 2022 మార్చి 31కి ముందు నమోదైన కార్మికులు ప్రమాదవశాత్తూ మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ.2లక్షల ఆర్థిక సహాయం అందుతుంది. పాక్షిక అంగవైకల్యానికి గురైతే రూ.లక్ష వస్తుంది. రేషన్ కార్డు లేని వారికి వాటిని జారీ చేస్తారు. వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు ఉంటాయి.

ప్లాట్‌ఫాం వర్కర్లకు ప్రత్యేకంగా..

ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలు, యాప్‌ల ఆధారంగా వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. వీరిని జిగ్ వర్కర్లని కూడా అంటారు. అయితే వారికి ఏదైనా ప్రమాదం ఎదురైతే ఆదుకొనే వారు ఎవరూ ఉండరు. కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉంది. ఇటీవల కొంతమూరులో ఓ బైక్ షేర్ యాప్ వర్కర్‌కి రోడ్డు ప్రమాదం జరిగి ప్రాణాలు వదిలాడు. ఇన్సూరెన్స్ వంటివి లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. అదే ఈ-శ్రమ్ కార్డు పొంది ఉంటే రూ.5లక్షల బీమా సొమ్ము వచ్చేది. అంతే కాకుండా వీరిని ప్రత్యేకంగా ఆదుకొనే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. అయితే, వీరి కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లోనే ప్రత్యేక నమోదు లింక్‌ని ఉంచారు. సాధారణ కార్మికుల మాదిరిగా నమోదు చేసుకోకూడదు. ప్లాట్‌ఫాం వర్కర్ల రిజిస్ట్రేషను ద్వారా మాత్రమే నమోదు చేసుకోవాలి. అమె జాన్, స్విగ్గీ, జొమాటో, బిగ్ బాస్కెట్, ర్యాపిడో, ఉబర్, ఓలా, ఫ్లిప్‌కార్ట్, బ్లింకిట్ వంటి వాటిలో పని చేస్తున్న వారందరూ అర్హులే కాకుండా రూ.5 లక్షల వరకూ బీమా సదుపాయం ఉంది. వీళ్ల రిజిస్ట్రేషన్‌కి ఈ-శ్రమ్ పోర్టల్‌లో 'ప్లాట్ ఫాం వర్కర్ కార్డు' అని కనిపిస్తుంది. దాని ద్వారా వివరాలను నమోదు చేసి కార్డు పొందవచ్చు.

ప్రతి కార్మికుడికీ ఉండాలి

ప్రతి కార్మికుడూ, ప్లాట్‌ఫాం వర్కర్ 'ఈ-శ్రమ్' కార్డును పొందాలి. చాలా సులభమైన ప్రక్రియ. ఎవరికివారు నమోదు చేసుకోవచ్చు. ఇప్పటివరకూ 3.50 లక్షల మంది రిజిస్ట్రేషను చేసుకున్నారు. మిగతావారు వెంటనే నమోదు చేసుకోవాలి. వారి సహ కార్మికులుకూడా నమోదు చేసుకొనే విధంగా చొరవచూపాలి. ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తు న్నాం. నమోదుకు ప్రత్యేకడ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం.

బీఎస్ఎం వలీ, సహాయ కార్మిక కమిషనర్, తూర్పు గోదావరి

ఫోన్ నెంబర్లు

ఏదైనా సందేహాలు ఉంటే 9492555064 /65/66/67 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

నమోదు చాలా సులభం...

ఈ-శ్రమ్ కార్డు కోసం నమోదు చేసుకోవడం చాలా సులభం. అధికారిక వెబ్‌సైటు https://eshram.gov.inలో సెల్ ఫోన్ నెంబరుతో లింక్ అయి ఉన్న ఆధార్ నెంబరు, అక్కడే కనబడే కేప్చా కోడ్ నమోదు చేయాలి. ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐపై నో అని ఎంచుకొని సెండ్ ఓటీపీపై క్లిక్ చెయ్యాలి. సెల్ నెంబరుకు వచ్చిన ఓటీపీ నెంబరును ఎంటర్ చేసి టెర్మ్స్ అండ్ కండీషన్స్ బాక్స్‌ని టిక్ చేసి సబ్మిట్ చేయాలి. మళ్లీ వచ్చిన ఓటీపీని, కాప్చా కోడ్‌ని ఎంటర్ చేసి వ్యాలిడేట్ బాక్స్‌పై క్లిక్ చేసి కంటిన్యూ టు ఎంటర్ అదర్ డిటైల్స్ బాక్స్‌పై కూడా క్లిక్ చేసి వివరాలు నమోదు చెయ్యాలి. నామినీ డిటెయిల్స్ అని వస్తుంది. వివరాలు ఇచ్చినా ఇవ్వకపోయినా పర్వాలేదు. సేవ్ అండ్ కంటిన్యూ తర్వాత స్టేట్, డిస్ట్రిక్ట్, ప్రస్తుత అడ్రస్, స్టేయింగ్ ఎట్ కరెంట్ లొకేషన్, పర్మనెంట్ అడ్రస్‌ల, చదువు, నెలవారీ ఆదాయం, వృత్తి, నైపుణ్యాలు, ప్రాథమిక వృత్తి, వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను తప్పనిసరిగా నమోదు చేసి సేవ్ అండ్ కంటిన్యూ బటన్ నొక్కాలి. బ్యాంక్ డిటెయిల్స్ ఇవ్వడం తప్పనిసరికాదు. తర్వాత రిజిస్ట్రేషన్ పూర్తయి ప్రివ్యూ అని వస్తుంది. మార్పులు ఉండే ఎడిట్ బటన్ ద్వారా చేసుకోవచ్చు. లేదా అండర్ టేకింగ్ బాక్సులో టిక్ చేసి సబ్మిట్ చేసేసి 'ఈ-శ్రమ్' కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.